ఆదివారం
21-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 328
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సుస్థిర, సుసంపన్న మధ్య ఆసియా ప్రపంచానికి అవసరం: జిన్‌పింగ్

సుస్థిర, సుసంపన్న, సామరస్య మధ్య ఆసియా ప్రపంచానికి ఎంతో అవసరమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. ఈ ప్రాంత సార్వభౌమత్వానికి, భద్రత, స్వాతంత్ర్యం, ప్రాదేశిక సమగ్ర పరిరక్షణకు, అభివృద్ధికి మధ్య ఆసియా స్వతంత్రంగా ఎంపిక చేసిన మార్గాలను, చర్యలను గౌరవించాలని, శాంతి, సుస్థిరత కల్పనకు అనుసరించే విధానాలకూ మద్దతివ్వాలన్నారు.

2 లో

ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిగా
సిద్ధ, డీకే ప్రమాణం

- కొత్త మంత్రులుగా ఎనిమిది మంది కూడా
- కర్నాటకలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రతిపక్షాల బలప్రదర్శనకు వేదికగా ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరైన విపక్షాల నాయకులు

బెంగళూరు:
కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. నూతన ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీ కంఠీరవ మైదానంలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. సిద్ధరామయ్య తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఇదే మైదానంలో కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎనిమిది మంది కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో జి.పరమేశ్వర, కేహెచ్ మునియప్ప, కేజే జార్జి, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక్ ఖర్గే (ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు), రామలింగ రెడ్డి, బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ ఉన్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల

- మిగతా 2 లో

ప్రహసనంగా
అవినాశ్ విచారణ
22న రావాలని సీబీఐ మళ్లీ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్ర మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పాత్రధారునిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి విచారణ ఓ ప్రహసనంగా మారింది. ఆయన విచారణ వ్యవహారంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే వివేకా హత్య కేసులో సీబీఐ ఆరు సార్లు అవినాశ్‌ను విచారించింది. ఈ నెల 16న విచారణకు రావాలని నోటీసులు జారీ చేయగా, తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలతో హాజరు కాలేనని ఎంపీ తెలియజేశారు. దీంతో ఈనెల 19న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ కోఠి సెంటర్‌లోని సీబీఐ కార్యాలయానికి విచారణకు రావాలంటూ సీబీఐ మరలా నోటీసు జారీ చేసింది. ఆరోజు అదే సమయానికి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి ఆయన బయలుదేరారు. కాని మధ్యలోనే రూటు మారింది. ఆయన కాన్వాయ్ జాతీయ రహదారి వైపు మళ్లింది. ఆయన లాయర్లు మాత్రమే సీబీఐ కార్యాలయానికి వెళ్లారు. అవినాశ్ రెడ్డి విచారణకు హాజరయ్యే పరిస్థితి లేదని అధికారులకు వివరించారు. ఆయన తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారని, అత్యవసరంగా వెళ్లాల్సి ఉన్నందున విచారణకు హాజరుకాలేకపోతున్నారని లిఖితపూర్వకంగా సీబీఐ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సీబీఐ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చింది.

ఆర్-5 జోన్‌లో 'గాలివాన బీభత్సం'

కుప్పకూలిన షెడ్లు

గాయపడ్డ కార్మికులు, పోలీసులు

రాజధాని అమరావతి పరిధిలోని ఆర్-5 జోన్‌లో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. నిడమర్రు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న పేదలందరికీ ఇళ్లు లేఅవుట్‌లో తాత్కాలిక షెడ్లు కుప్పకూలి కార్మికులపై పడడంతో దాదాపు 27 మంది కార్మికులకు గాయాలయ్యాయి.

2 లో

గృహాలకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు విరమించకుంటే
మరో విద్యుత్ ఉద్యమం తప్పదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరిక
- అదానీ కంపెనీలపై అంత ప్రేమెందుకో సీఎం చెప్పాలని డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
రాష్ట్రంలోని గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యోచనను ఉపసంహరించుకోకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఏపీలోని పోర్టులు, విద్యుత్ ఒప్పందాలు, కాంట్రాక్టులు అన్నింటినీ అదానీ కంపెనీలకే అప్పగించడం వెనుక మీ మధ్య లాలూచీ ఏమిటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోటి 30 లక్షల గృహ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జగన్ ప్రభుత్వం రైతుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ నిరంకుశంగా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు బిగించి, రైతుల మెడకు గుదిబండ వేసిందని విమర్శించారు. రైతులకిచ్చే ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకే ఈ దుష్ట నిర్ణయం చేసింది. ఇప్పుడు 200 యూనిట్లుపైబడి వినియోగించే 27లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లకు తొలిదశలో, మరో 25 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లకు రెండోదశలో స్మార్టు మీటర్లు బిగించే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంకావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రామకృష్ణ తెలిపారు. జగన్‌కి అదానీ కంపెనీలపై విపరీతమైన ప్రేమ రోజురోజుకీ పెరిగిపోతోందన్నారు. పోర్టు నుంచి ప్లాంట్ల వరకు వదలకుండా అదానీకి అప్పనంగా కట్టబెడుతున్నారని తెలిపారు. అదానీ ఆర్థిక అవకవతకలపై హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతమైనప్పటి నుంచి దేశ వ్యాప్తంగా అదానీ సంస్థలపై చర్చ జరుగుతుంటే, వైసీపీ ప్రభుత్వం మాత్రం హడావుడిగా మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి అదానీ కంపెనీలకు కోట్లాది రూపాయల విలువగల భూములను అప్పనంగా కట్టబెట్టిందన్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి రాష్ట్రంలోని గృహాలకు స్మార్ట్‌మీటర్లు బిగించే కాంట్రాక్టు కూడా అదానీ సంస్థకే అప్పచెపుతోందన్నారు. ఈ మేరకు సింగిల్ ఫేజ్‌లో 33 నెలలకు రూ.94 చొప్పున రూ. 8742, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల నుంచి 33 నెలల పాటు 120 చొప్పున రూ.11,160 వసూలు చేసేందుకు సూత్రప్రాయంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదానీ సంస్థకు మధ్య అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాల కంటే అత్యధిక ధరలకు అదానీ కంపెనీ ఏపీలో బిడ్ దాఖలు చేసింది. అసలు అదానీ కంపెనీలకు, జగన్ ప్రభుత్వానికి మధ్య ఉన్న లాలూచీ ఏంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గృహాలకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు తీవ్ర భారమేనన్న విషయం ప్రజలందరూ గ్రహించాలి. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను ఇప్పటికైనా విరమించుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న ఎండ తీవ్రత
కనిగిరి, రాచెర్లలో అత్యధిక ఉష్ణోగ్రతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఏపీలో ఉష్ణోగ్రతల తీవ్రత ఇంకా కొనసాగుతోంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం కూడా 46 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాయవ్య భారత్ నుంచి తీవ్రమైన వేడిగాలులు వీస్తున్నాయని, తెలంగాణ, కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా ఉపరితల ద్రోణి ప్రభావం కొనసాగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది. అండమాన్ సముద్ర తీర ప్రాంతాల నుంచి ఈశాన్య భారత్ వరకు నైరుతి గాలులు బలంగా కదులుతున్నాయని, మూడు రోజుల్లోగా అండమాన్ నికోబార్ దీవులపై నైరుతి రుతుపవనాలు విస్తరించే సూచనలున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాగల నాలుగైదు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. కొన్ని చోట్ల ఉరుములు, పిడుగులతో వర్షం కురిసే సూచనలున్నాయని, కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రకాశం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 45.68 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఇదే జిల్లా రాచెర్లలో కూడా 45.67 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా,

- మిగతా 2 లో

యుగపురుషుడు ఎన్టీఆర్

- పేదల కష్టాలు తెలిసిన నేత
- ఘనంగా శతజయంతి వేడుకలు
- హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు

విశాలాంధ్ర-హైదరాబాద్:
రాజకీయాల్లో ఎన్టీఆర్ తనదైన ముద్ర వేశారనీ, పేదల కష్టాలు తెలిసిన నిజమైన నాయకుడని వక్తలు కొనియాడారు. సామాజిక న్యాయం కోసం తపించేవారనీ, ఆయన్ను అందుకే అందరూ యుగపురుషుడు అంటారని చెప్పారు. ఎన్టీఆర్ అందరి అభిమాన నటుడనీ, అటువంటి మహానటుడికి భారతరత్న ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తెలుగు దేశం పార్టీ స్థాపించి ఎన్టీఆర్ ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారనీ, కళకు, భాషకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారన్నారు. ఆయనను తెలుగు చలన చిత్ర పరిశ్రమకు మూలస్తంభంగా పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శత జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని కైత్లాపూర్ మైదానంలో శనివారం ఘనంగా జరిగాయి. పది ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనపై రచించిన 'ఎన్టీఆర్ శకపురుషుడు' పుస్తకాన్ని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నందమూరి కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.
కార్యక్రమంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ రాజకీయాల్లో ఎన్టీఆర్ తనదైన ముద్ర వేశారని కొనియాడారు." పేదల కష్టాలు తెలిసిన నిజమైన నాయకుడు ఎన్టీఆర్. సామాజిక న్యాయం కోసం తపించేవారు. ఆయన్ను అందుకే అందరూ యుగపురుషుడు అంటారు. గొప్ప నటుడిని స్మరించుకోవడం ఆనందంగా ఉంది. నటనలో ఎన్టీఆర్ ఆయనకు ఆయనే సాటి. గొప్ప నటనతో ప్రజల మనసులు దోచుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణలు తెచ్చిన నాయకుడు. ఎన్టీఆర్ చాలా సున్నిత మనస్తత్వం కలిగిన నాయకుడు. రాజకీయ నేతగా ఆయనది ప్రత్యేకశైలి.. ముందు చూపు ఉన్న నేత. ప్రాంతీయ పార్టీలకు గౌరవం, గుర్తింపు తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే" అని అన్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ, దేవుడి పేరు తలచుకుంటే ఎన్టీఆర్ గుర్తుకు వస్తారని అన్నారు. "మోహన్ కందా మా మేనమామ.. ఆయన ఎన్టీఆర్ గురించి ఎన్నో విషయాలు చెప్పేవారు. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని ఇందిరాగాంధీ నిరంకుశంగా రద్దు చేసింది. రాష్ట్రపతి ముందు 153 మంది ఎమ్మెల్యేలతో పరేడ్ చేయించడం నాకు బాగా గుర్తు. చిన్నప్పటి నుంచి దేవుడు ఎలా ఉంటాడు అని గుర్తు చేసుకుంటే ఎన్టీఆర్ గుర్తుకు వస్తారు. రాజ్యాంగం హక్కుల్ని కాపాడేందుకు ఎన్టీఆర్ చివరి వరకు కృషి చేశారు" అని ఏచూరి అన్నారు.దత్తాత్రేయ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సినీ రంగానికి ఎనలేని సేవ చేశారని, నీతికి, నిజాయితీకి, క్రమశిక్షణకు మారు పేరు ఎన్టీఆర్ అని కొనియాడారు." రాజకీయాల్లో ఎంతో క్రమశిక్షణ తెచ్చిన నాయకుడు. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసిన నాయకుడు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దిల్లీకి తెలుగుదనం గురించి చాటిచెప్పిన నేత ఎన్టీఆర్. రాజకీయాల్లో మచ్చలేని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మనల్ని కూడా జనం వెనక్కి పంపిస్తారేమో అనిపిస్తోంది బ్రదర్!

నెల్లూరు వైసీపీలో వర్గ పోరు

- విద్యార్థి విభాగ నాయకుడిపై హత్యాయత్నం
- చర్చనీయాంశంగా వరుస దాడులు
- వేడెక్కుతున్న రాజకీయాలు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు :
నెల్లూరు వైసీపీలో వర్గ పోరు తారస్థాయికి చేరింది. మాజీ మంత్రి, వైసీపీ నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, ఆయన బాబాయి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. రూప్‌కుమార్ అనుచరుడు, వైసీపీ విద్యార్థి విభాగం నాయకుడు హాజీ అబ్దుల్‌పై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేయగా, అతనిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యం కోసం చేర్పించారని సమాచారం. అయితే దాడికి పాల్పడింది ఎమ్మెల్యే అనిల్ కుమార్ వర్గం వారేనని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఒక్క సారిగా రాజకీయాలు వేడెక్కాయి. గతంలో ఒక వైసీపీ కార్పొరేటర్ ఇంటిపై దాడి తదితర సంఘటనలకు వైసీపీలో వర్గ విభేదాలే కారణమని ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి వరుస సంఘటనలతో నెల్లూరు నగర రాజకీయాలు చర్చనీయాంశంగా మారాయి. కాగా, తన అనుచరుడు హాజీ అబ్దుల్‌పై దాడి విషయం తెలిసిన అనంతరం శనివారం ఉదయం డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి హాజీని పరామర్శించారు. అలాగే హాజీ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను సంప్రదించగా, అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై శనివారం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా, నగరంలో ఏ ప్రాంతంలోనైనా దాడులు జరిగితే అవన్నీ తమపై రుద్దుతూ బురద చల్లడం సరికాదన్నారు. నగరంలో ఇటీవల ఒక టీడీపీ నాయకుడి కాలు విరిగితే తానే బాధ్యుడి అని అనేక మంది ఆరోపించారని, అనంతరం దానిపై

- మిగతా 2 లో

చింతపల్లిలో విష జ్వరాలు

- ప్రబలుతున్న వ్యాధులు
- రోగులతో ఆసుపత్రి కిటకిట
- విద్యార్థిని మృతి

2 లో

చింతపల్లి మండల కేంద్రంలో డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి. అసలే వేసవి తాపం, అందులో అప్రకటిత విద్యుత్ కోతతో రేయింబవళ్ళు రక్తం పీల్చే దోమలతో డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి.

ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక సాయం

రష్యాపై మరిన్ని ఆంక్షలకు జీ7 దేశాల సంకల్పం

హిరోషిమాలో సదస్సుకు నిరసన సెగ

టెహ్రాన్/హిరోషిమా: ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక సాయాన్ని మరింతగా అందించేందుకు జీ7 దేశాలు సంకల్పించాయి. ఉక్రెయిన్ సార్వభౌమత్వంపై రష్యా అక్రమ దాడులను కట్టడి చేసేందుకు మరిన్ని చర్యలు తీసుకోనున్నామని తెలిపాయి. ఉక్రెయిన్‌కు ఆర్థికంగానే కాకుండా సైనిక, ఆయుధ, దౌత్య, మానవతా సాయాన్ని సుదీర్ఘకాలం వరకు అందించడానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి. ఉక్రెయిన్ నుంచి తమ సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని రష్యాకు జీ7 దేశాలు హితవు పలికాయి. రష్యా సైన్యం వెనక్కి వెళ్లకుండా శాంతి నెలకొల్పడం సాధ్యం కాదని పేర్కొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ శాంతి ఫార్ములాకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని నిర్ణయించాయి. యుద్ధ సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక పరికరాలు, సేవలపై మరిన్ని కఠిన ఆంక్షలను విధిస్తున్నట్లు వెల్లడించాయి.. ఇదిలావుంటే, రష్యా, ఇతర దేశాలకు చెందిన మరో 70 సంస్థలను అమెరికా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టనున్నట్లు అమెరికా సీనియర్ ప్రభుత్వాధికారి వెల్లడించారు. రష్యాతో జరిగే వజ్రాల వ్యాపారాన్ని బ్రిటన్ లక్ష్యంగా చేసుకుంది. రాగి, అల్యూమినియం, నికెల్‌తో పాటూ రత్నాల దిగుమతులపై నిషేధం విధించనున్నట్లు ప్రకటించింది. రష్యాలో లభించే, తయారయ్యే వజ్రాలను వినియోగించడం, వాటి వ్యాపారం ఆంక్షలు విధిస్తున్నట్లు జీ7 ప్రకటన పేర్కొంది. జీ7శిఖరాగ్ర సదస్సు జపాన్, హిరోషిమాలో శుక్రవారం మొదలైంది. అయితే ఈ సదస్సును నిరసన సెగ తాకింది. జీ7కు వ్యతిరేకంగా హిరోషిమాలో వేలాదిమంది ఆందోళనకు దిగారు. సదస్సు వేదిక వద్దనున్న శాంతి పార్క్‌కు చేరుకొని 'చెత్త జీ7', 'యుద్ధాన్ని పురిగొల్పవద్దు', 'జపాన్-అమెరికా సైనిక పొత్తు వద్దు' అన్న ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం భారీ ప్రదర్శన నిర్వహించారు. 'అమెరికా సామ్రాజ్యవాదులు, నంబర్ వన్ టెర్రరిస్ట్', అసత్యాలు ఆపండి, యుద్ధాన్ని ఆపండి, క్వాడ్ కూటమి వద్దు, నాటో కూటమి వద్దు' అని నినాదాలు చేశారు. హిరోషిమాతో సహా జపాన్‌లో అనేక నగరాల్లో నిరసనలు, ర్యాలీలు జరిగాయి. దేశ విదేశాల నుంచి వచ్చిన వారు వీధుల్లోకి వచ్చి జీ7కి వ్యతిరేకంగా నినదించారు.

అణ్వాస్త్రాలు రహిత ప్రపంచమే లక్ష్యం: బైడెన్

అణ్వాస్త్రాలు రహిత ప్రపంచాన్ని సృష్టించేందుకు చేయగలిగినదంతా చేస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉద్ఘాటించారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయం...1945లో అమెరికా అణుబాంబు దాడివల్ల జరిగిన వినాశనాన్ని కళ్లకుకట్టే హిరోషిమాలోని పీస్ మెమోరియల్ మ్యూజియాన్ని ఆయన సందర్శించారు. గతంలో బరాక్ ఒబామా మాత్రమే అమెరికా అధ్యక్షుడిగా హిరోషిమా గడ్డపై అడుగు పెట్టారు. బైడెన్‌తో పాటు బ్రిటన్, ఫ్రాన్స్ తదితర అణుశక్తి దేశాధినేతలు కూడా ఈ మ్యూజియాన్ని సందర్శించారు. 'శాంతితో కూడిన భవిష్యత్ నిర్మాణానికి ఎంతగా కట్టుబడాలన్నది ఈ మ్యూజియం చెప్పే గాథలు మనకు గుర్తుచేస్తాయి' అని అతిథుల పుస్తకంలో బైడెన్ రాశారు. 'అణ్వాయుధాలు లేని ప్రపంచాన్ని సృష్టించేందుకు కలిసికట్టుగా ప్రయత్నిద్దాం' అని జీ7దేశాలకు పిలుపునిచ్చారు.

ఉక్రెయిన్‌కు 375 మిలియన్ డాలర్ల ప్యాకేజీ

ఉక్రెయిన్‌కు 375 మిలియన్ డాలర్ల ఆర్థికప్యాకేజీని బైడెన్ ప్రకటించారు. ఈ ప్యాకేజీలో భాగంగా ఆయుధాలు, సాయుధ వాహనాలు, యాంటీ ట్యాంక్ అస్త్రాలు తదితరాలు ఉన్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది.

సుస్థిర, సుసంపన్న మధ్య ఆసియా ప్రపంచానికి అవసరం: జిన్‌పింగ్



జియాన్: సుస్థిర, సుసంపన్న, సామరస్య మధ్య ఆసియా ప్రపంచానికి ఎంతో అవసరమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. ఈ ప్రాంత సార్వభౌమత్వానికి, భద్రత, స్వాతంత్ర్యం, ప్రాదేశిక సమగ్ర పరిరక్షణకు, అభివృద్ధికి మధ్య ఆసియా స్వతంత్రంగా ఎంపిక చేసిన మార్గాలను, చర్యలను గౌరవించాలని, శాంతి, సుస్థిరత కల్పనకు అనుసరించే విధానాలకూ మద్దతివ్వాలన్నారు. తమ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ప్రాంతాన్ని దుర్వినియోగించే హక్కు ఎవరికీ లేదని నొక్కిచెప్పారు. చైనా, మధ్య ఆసియా దేశాల సంబంధాల కొత్త యుగం అద్భుతమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. షాంజీ ప్రావిన్స్‌లోని జియాన్ నగరంలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో మాట్లాడుతూ ఇదొక మైలురాయని అన్నారు. దశాబ్ద కాలంలో తమ బంధం కొత్త యుగంలోకి ప్రవేశించిందన్నారు. యూరేసియాకు కీలకమైన కనెక్టివిటీ హబ్‌గా తయారయ్యే సామర్థ్యం మధ్య ఆసియాకు ఉన్నదని జిన్‌పింగ్ అన్నారు. ఇదిలావుంటే, జిన్‌పింగ్ బుధవారం నుంచి గురువారం వరకు మధ్య ఆసియా దేశాలైన కజకస్తాన్, తజికిస్తాన్, కిర్గిస్తాన్, ఉజ్బెకిస్తాన్ దేశాల అధ్యక్షులతో వరుస భేటీ అయ్యారు. చైనాతో కలిసి పనిచేసేందుకు, ఉమ్మడి అభివృద్ధి లక్ష్యాలు సాధించుకునేందుకు, సహకారాన్ని పెంచుకునేందుకు సుముఖంగా ఉన్నట్లు మధ్య ఆసియా దేశాధినేతలు జిన్‌పింగ్‌కు వెల్లడించారు.

ఒబామాతో సహా 500 మంది అమెరికన్లపై రష్యా నిషేధం

రష్యా: ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై అమెరికాతో సహా అనేక దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో సహా 500 మంది అమెరికన్లపై రష్యా తాజాగా ఆంక్షలు విధించింది. ఈ మేరకు రష్యా విదేశాంగ శాఖ ప్రకటించినట్లు సీఎన్ఎన్ శనివారం నివేదించింది. ఈ జాబితాలో 45మంది యూఎస్ చట్టసభ సభ్యులు, మాజీ రాయబారులు ఉన్నారు. ఏయే కారణాలతో నిషేధం విధించారన్నది రష్యా వెల్లడించలేదు. రష్యా విడుదల చేసిన జాబితాలో ఒబామాతో పాటు అమెరికా మాజీ రాయబారి జాన్ హన్ట్స్‌మాన్, యూఎస్ సెనేటర్లు, జాయింట్ చీఫ్స్ తదుపరి చైర్మన్ చార్లెస్ క్యూ బ్రౌన్ జూనియన్, టీవీ వ్యాఖ్యతలు జిమ్మీ కిమ్మల్, కాల్బర్ట్, సేత్ మేయర్స్ తదితరులున్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం మొదలైనప్పటి నుంచి అమెరికా, రష్యా మధ్య సంబంధాలు చెడిపోయాయి. ఎన్నడు లేని దారుణ స్థితికి చేరుకున్నాయి. అయితే తమపై ఎలాంటి దాడికైనా ప్రతిస్పందన తప్పక ఉంటుందని వాషింగ్టన్ ఇప్పటికైనా గ్రహించాలని రష్యా ప్రకటించింది. అదే విధంగా వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇవాన్ గెర్ష్కోవిచ్‌కు కాన్సులర్ ప్రవేశానుమతి ఇవ్వాలన్న అమెరికా అభ్యర్థననూ తిరస్కరించింది.

చింతపల్లిలో విష జ్వరాలు

విశాలాంధ్ర- చింతపల్లి: వ్యాధుల తీవ్రతతో చింతపల్లి మండల కేంద్రం మంచం పట్టింది. వాతావరణంలో మార్పులు, గ్రామంలో చోటు చేసుకున్న అధ్వాన్న పారిశుధ్యం, పారని మురుగు నీటి వ్యవస్థ, పెరుగుతున్న దోమలు, ప్రజలంతా సేవించే ఊట నీటి (పెద్ద పైపు) వద్ద బట్టలు ఉతకడం తో కలుషితం అవుతున్న త్రాగు నీరు కారణంగా చింతపల్లి మండల కేంద్రంలో డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి. అసలే వేసవి తాపం, అందులో అప్రకటిత విద్యుత్ కోతతో రేయింబవళ్ళు రక్తం పీల్చే దోమలతో డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలోని పెద్ద పైపు ప్రాంతం సహా అనేక వీధులలో జ్వరాలు విజృంభించాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ వ్యాధుల బారినపడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినా సరైన రిపోర్టు రాని కారణంగా రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఆసుపత్రిలోనూ సరైన వైద్యం అందక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు, మైదాన ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆర్వీ నగర్ వైద్యాధికారి మహేశ్ ఆధ్వర్యంలో అనేక వీధులలో వైద్య శిబిరాలు నిర్వహించారు. గడచిన మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రామాలయం వీధికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఉగ్రంగి దణేశ్వరి (14) ప్రాణాలు కోల్పోయింది. రక్షిత నీరు అందించకపోవడంతో పాటు, పారిశుద్ధ్య సమస్య, మురుగు, దోమల నియంత్రణలో పాలకులు, అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని స్థానికులు విమర్శిస్తున్నారు.

సిద్ధ, డీకే ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్ (రాజస్థాన్), భూపేశ్ బాఘెల్ (చత్తీస్‌గఢ్), సుఖ్విందర్ సింగ్ సుక్కు (హిమాచల్ ప్రదేశ్), తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్, సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారం ఏచూరి, ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, ఎన్‌సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ, ప్రముఖ నటుడు కమల్ హాసన్ హాజరయ్యారు. దీంతో ప్రమాణ స్వీకారోత్సవం... ప్రతిపక్షాల బలప్రదర్శనకు వేదికగా మారింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గైర్హాజరు కాగా ఆమె స్థానంలో లోక్‌సభలో టీఎంపీ డిప్యూటీ నేత కకోలి ఘోష్ దస్తిదార్ హాజరయ్యారు. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఆ పార్టీకి మద్దతిస్తామని 2024 లోక్‌సభ ఎన్నికలనుద్దేశించి మమత ఇటీవల ప్రకటించారు. 'కాంగ్రెస్ ఎక్కడ బలంగా ఉంటే అక్కడ పోటీ చేయనివ్వండి. మేము మద్దతిస్తాం. అందులో తప్పేమీ లేదు. ఆ పార్టీ కూడా మిగతా పార్టీలకు మద్దతివ్వాలి' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ అఖండ విజయాన్ని సాధించిన క్రమంలో ఆమె ఈ ప్రకటన చేశారు. ప్రతిపక్షాల ఐక్యతకు, బల ప్రదర్శనకు, సంఘీభావానికి లాంచ్‌ప్యాడ్‌గా ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని కేంద్రమాజీ మంత్రి ఎం.వీరప్ప మొయిలీ అన్నారు. కార్యక్రమానికి జేఎంఎం, ఆర్‌జేడీ, శివసేన, ఎస్‌పీ, ఎండీఎంకే, ఆర్ఎస్‌పీ, సీపీఐ(ఎంఎల్), వీకేసీ, ఆర్ఎల్‌డీ, కేరళ కాంగ్రెస్, ఐయూఎంఎల్ పార్టీల నాయకులను కూడా కాంగ్రెస్ ఆహ్వానించింది.

యుగపురుషుడు ఎన్టీఆర్

(మొదటిపేజీ తరువాయి)

నాయకుడు. రాజకీయాల్లో భేదాభిప్రాయం ఉండొచ్చుకానీ, శత్రుత్వం పనికిరాదు" అని దత్తాత్రేయ అన్నారు.

నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ అందరి అభిమాన నటుడు. తెలుగువారు ఉన్న ప్రతిచోట ఆయన శత జయంతి జరుగుతున్నది' అని అన్నారు. తనను ఎన్టీఆర్ తమ్ముడిగా పిలిచేవారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వకపోవడం బాధాకరమని, కేంద్రం ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలన్నారు. ఎన్టీఆర్‌తో కలిసి ఎన్నో సినిమాల్లో నటించానని, ఆయన నుంచి క్రమశిక్షణను నేర్చుకున్నానని, చివరి చిత్రంలోనూ ఆయనతో కలిసి నటించే అవకాశం లభించిందని నటి జయసుధ తెలిపారు. నాగచైతన్య మాట్లాడుతూ 'తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఎన్టీఆర్ మూలస్తంభం. ఆయన అందం, క్రమశిక్షణ, వాక్చాతుర్యం అందరికీ తెలుసు. రాముడు, కృష్ణుడు అంటే నాకు గుర్తుకువచ్చేది ఆయనే. ఎన్టీఆర్ గురించి తాతయ్య గౌరవంగా మాట్లాడేవారు. వాళ్ల స్నేహం గురించి విని స్ఫూర్తి పొందాను. తెలుగు దేశం పార్టీ స్థాపించి.. ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. కళకు, భాషకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారు' అని అన్నారు.

హీరో వెంకటేశ్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ సినీ పరిశ్రమకు చేసిన సేవ గురించి మాట్లాడాలి అంటే అర్హత ఉండాలి. శత జయంతి వేడుకల్లో ఆ మహనీయుడిని తలచుకునే అదృష్టం రావడం గొప్ప విషయం. భౌతికంగా మన మధ్యలేక పోయినా ఆయన ప్రజల గుండెల్లో ఉన్నారు. నాది తెలుగు భాష అని చెప్పినప్పుడు ఉండే గర్వం పేరే ఎన్టీఆర్. ఒక జాతి కథే ఆయన చరిత్ర. ఆయనతో నటించలేకపోవడం బాధాకరం' అని అన్నారు. నటుడు అడవి శేషు మాట్లాడుతూ 'నేను చూసిన మొదటి తెలుగు సినిమా 'మిస్సమ్మ'. ఆ సినిమా చూసి నటుడిని కావాలనుకున్నా. ఎన్టీఆర్ సినిమాలు స్ఫూర్తిదాయకం' అని తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణ, పురందేశ్వరి, భువనేశ్వరి, లోకేశ్వరి, వసుంధర, బ్రహ్మణి, దేవాన్ష్‌తోపాటు సినీ ప్రముఖులు రామ్ చరణ్, బాబు మోహన్, విజయేంద్ర ప్రసాద్, అల్లు అరవింద్, అశ్వినీదత్, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, అనిల్ రావిపూడి, శ్రీలీలతోపాటు కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, నాగచైతన్య, సుమంత్, సిద్ధు జొన్నలగడ్డ, అడివిశేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పు కప్పిపుచ్చుకునేందుకే

రూ.2వేలనోట్ల ఉపసంహరణపై ప్రతిపక్ష నాయకులు

న్యూఢిల్లీ: పెద్దనోట్లను రద్దుతో జరిగిన తప్పును కప్పిపుచ్చుకు నేందుకు రూ.2వేల నోట్లను కేంద్రం ఉపసంహరిస్తోందా అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం విమర్శించారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందు రెండోసారి నోట్ల రద్దన్నారు. నోట్ల రద్దు మొత్తం వ్యవహారంపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నోట్లను ఎప్పుడు టాయిలెట్ పేపర్లుగా మార్చేస్తారో అని భయపడే పరిస్థితిని పౌరులకు కల్పిస్తోందని టీఎంసీ విమర్శించింది. చెలామణిలో ఉన్న నగదు పెరిగిందంటే అర్థం అవినీతి పెరిగినట్టే కదా మోదీజీ అని ఎంపీ కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. చలామణిలో ఉన్న రూ.2వేల నోట్లను ఉపసంహరించుకోనున్నట్లు ఆర్బీఐ శుక్రవారం ఆకస్మిక ప్రకటన చేసింది. తక్షణమే ఈ నోట్ల జారీని నిలిపివేయాలని బ్యాంకులకు ఆదేశాలిచ్చింది. సెప్టెంబర్ 30లోగా నోట్లు మార్చుకోవాలని ప్రజలకు సూచించింది. తాజా పరిణామాలపై ఖర్గే హిందీలో ట్వీట్లు చేశారు. 'మొదటి నోట్లరద్దుతో ఆర్థిక వ్యవస్థకు కోలుకోలేని దెబ్బతగిలింది. అసంఘటిత రంగం నాశమైంది. ఎంఎస్ఎంఈ రంగం కుదేలైంది. కోట్లాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. రెండోసారి నోట్ల రద్దుతో తప్పుడు నిర్ణయాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తున్నారా? దీనిపై నిష్పాక్షిక విచారణ జరిపించి నిజనిజాలు నిగ్గు తేల్చాలి' అని పేర్కొన్నారు. మరోసారి ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు 'నోట్‌బందీ'ని మోదీ ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం నిర్వహించిన సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ 'మోదీ కొత్త ఉత్తర్వులు జారీచేశారు. ఆయన జపాన్‌కు ఎప్పుడు వెళ్లినా నోట్ల రద్దుకు నోటిఫికేషన్ ఇచ్చి వెళతారు. గతసారి వెళ్లినప్పుడు వెయ్యి రూపాయల నోట్లు రద్దు చేశారు. ఈసారి రూ.2వేల నోట్లు రద్దు చేశారు' అని విమర్శించారు. ఇలా చేయడం వల్ల దేశానికి లాభమా? నష్టమా? అన్నదీ మోదీకి తెలియదని, ప్రజలను ఇబ్బంది పెట్టడం తప్ప ఈ నోట్ల రద్దుతో జరిగేదేమీ ఉండదని ఖర్గే వ్యాఖ్యానించారు. కర్నాటకలో ఉన్న మా ప్రభుత్వం... ప్రేమ ప్రభుత్వం. అందరితో కలిసి ప్రయాణిస్తుంది' అని ఉద్ఘాటించారు. రాష్ట్రానికి ఇచ్చిన ఐదు హామీలను అమలు చేసేలా తొలి కేబినెట్ భేటీ నిర్ణయిస్తుందని చెప్పారు. ఒకటి చెప్పి మరొకటి చేసేందుకు మేం బీజేపీలా కాదు.. చెప్పిందే చేస్తాం. ఐదు హామీలను అమలు చేస్తామని కన్నడీగులకు ఖర్గే హామీనిచ్చారు.

ఎన్నికల కోసమే: సీపీఐ కార్యదర్శి నారాయణ



దేశంలో అవినీతి లేదని చెప్పిన బీజేపీ మాత్రం హోల్‌సేల్‌గా అవినీతికి పాల్పడుతుందని, రాబోయే ఎన్నికల కోసమే చలామణిలో ఉన్న రూ.2వేల నోట్లను నిలుపుదల చేసిందని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ తాజా నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వానికి నల్లధనాన్ని అంతం చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే రూ. 2వేల నోట్లను వెంటనే రద్దు చేయాల్సిందని అన్నారు. రూ.500, రూ. 1000 రద్దు సమయంలో కోట్లల్లో నల్లధనం తెల్లగా మారిందని విమర్శించారు. గతంలో పెద్దనోట్ల రద్దు ప్రక్రియలో 3.4 లక్షల కోట్ల నల్లధనం బయటపడుతుందని, ప్రతి భారతీయుడు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని హామీ ఇచ్చిన మోదీ పైసా కూడా ఇవ్వలేదన్నారు.

మోదీకి ఐదు ప్రశ్నలు సంధించిన ఒవైసీ

రూ.2వేల నోట్ల రద్దుపై ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ మోదీకి ఐదు ప్రశ్నలను సంధించారు. 'ఆర్థికవేత్త మోదీకి ఐదు ప్రశ్నలు: రూ.2వేల నోట్లను అసలు ఎందుకు తెచ్చారు? రూ.500 నోటు కూడా త్వరలోనే రద్దు అవుతాయని భావించాలా? 70 కోట్ల మంది భారత పౌరుల వద్ద స్మార్ట్‌ఫోన్లు లేవు. మరి వారు డిజిటల్ చెల్లింపులు ఎలా చేస్తారు? నోట్లరద్దు 1.0, నోట్లరద్దు 2.0లో బిల్‌గేట్స్‌కు చెందిన 'బెటర్ దాన్ క్యాష్ అలయన్స్' పాత్ర ఏమిటి? చైనా హ్యాకర్లు ఎన్‌పీసీఐని హ్యాక్ చేశారా? అదే నిజమైతే యుద్ధం వచ్చినప్పుడు చెల్లింపుల సంగతేమిటి?' అని ఒవైసీ ప్రశ్నించారు. ఇదే అంశంపై ఎంపీ కపిల్ సిబల్ స్పందిస్తూ 'చలామణిలో నగదు పరిమాణం అనేది అవినీతికి ముడిపడి ఉంటుందని మోదీ గతంలో చెప్పారు. 2016లో రూ.17.7 లక్షల కోట్లు చలామణిలో ఉంటే 2022కి రూ.30.18 లక్షల కోట్లకు పెరిగింది. అంటే అవినీతి పెరిగిందా! మీరేమంటారు మోదీజీ' అని వ్యాఖ్యానించారు. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా కూడా కేంద్రప్రభుత్వ తాజా చర్యను తీవ్రస్థాయిలో విమర్శించారు. నోట్లను ఎప్పుడు టాయిలెట్ పేపర్లుగా మార్చేస్తారో అని భయపడే పరిస్థితిని పౌరులకు ఏ దేశం తీసుకు రాదు. కొన్నేళ్లకు వాలెట్లలో ఉన్నదంతా ఆవిరవుతుందని మేముందుకు ఒత్తిడికి లోనవ్వాలి? బీజేపీ, మోదీ ఎన్ని ప్రయత్నాలు చేసినా దేశప్రజల దృష్టిని మళ్లించలేరు. కర్నాటకలో మీరు ఓడిపోయారు. మరిన్ని రాష్ట్రాల్లోనూ ఓటమి తప్పదు. అదానీని కూడా కాపాడలేరు' అని ఆమె పేర్కొన్నారు. నోట్ల రద్దు వ్యవస్థాగత లూటీ అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తొస్తున్నాయి. రూ.2వేల నోట్లను రద్దుకు మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ద్వారా గత అనుభవాల నుంచి నేర్చుకున్నది ఏమీ లేదని, ఈ ప్రభుత్వానికి ముందుచూపు కూడా లేదని స్పష్టమవుతోంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 30 తర్వాత రూ.2000 నోటు లీగల్ టెండర్‌గా కొనసాగుతుందా? లేదా? అనేది ఆర్బీఐ స్పష్టంచేయాలని కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ కోరారు. తాను ముద్రించిన నోట్లను ఏడేళ్లు కూడా వినియోగించలేకపోయిన వ్యక్తి గత 70ఏళ్లలో దేశం చేసినదేమిటని ప్రశ్నిస్తుంటారని కాంగ్రెస్ మీడియా శాఖాధిపతి పవన్ ఖేరా ఎద్దేవా చేశారు.

రేపు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు

జర్నలిస్టులపై దాడులకు నిరసనగా ఏపీయూడబ్ల్యూజే పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): జర్నలిస్టులపై ఎంపీ అనుచరుల దాడిని నిరసిస్తూ, నిందితుల అరెస్టు, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం కోసం డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనదినం పాటించాలని ఏపీయూడబ్ల్యూజే పిలుపునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని సూచించింది. అన్ని జిల్లాల కలెక్టర్లకు, ఎస్పీలకు వినతిపత్రాలు అందచేయాలని జిల్లా శాఖలను కోరింది. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు దక్కేవరకూ పోరాటం కొనసాగించాలని శనివారం జూమ్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్ణయించింది. వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హైదరాబాద్‌లో సీబీఐ కోర్టు వద్ద విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులపై దాడులు, విజయనగరం జర్నలిస్టులపై సీఐడీ కేసు వంటి అంశాలపై సమావేశం చర్చించింది. అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రెడిటేషన్ అందేవరకూ రాష్ట్ర, జిల్లాశాఖల బాధ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, సమస్య పరిష్కారమయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలని, కమిషనర్ ఇచ్చిన హామీలు అమలు జరుగుతున్నవీ లేనిదీ గమనించాలని నాయకులు సూచించారు. వాట్సాప్‌లో వచ్చిన జీవో అనువాదం గురించి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శివప్రసాదరావుతో పాటు, విజయనగరంలోని శ్రీను అనే జర్నలిస్టు పై ఏపీ సీఐడీ విభాగం కేసు పెట్టడాన్ని ఖండించారు. సమావేశంలో ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయులు, ఐజేయూ జాతీయకార్యదర్శి డి.సోమసుందర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు డా.ప్రసాద్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్రఉపాధ్యక్షులు కంచర్ల జయరాజ్, కార్యదర్శులు జయప్రకాష్, ప్రసాదరావు, రామసుబ్బారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెల్లూరు వైసీపీలో వర్గ పోరు

(మొదటిపేజీ తరువాయి)

విచారణ జరిపితే వారి కుటుంబ కలహాలే కారణమని తేలిందని గుర్తు చేశారు. జిల్లాలో జరిగే ప్రతి సంఘటనను తనపై రుద్దడం ఏమిటని ప్రశ్నించారు. తాను ఇటువంటి దాడులకు ఉసిగొల్పే వ్యక్తిని కాదని, తన రాజకీయాలు హుందాగా ఉంటాయన్నారు. తనపై పదే పదే అసత్య ఆరోపణలు చేసేవారి తాట తీస్తానని హెచ్చరించారు. కాగా వరుస దాడుల సంఘటనలపై రూప్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరల సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి గెలుపొందాలని కోరుకుంటున్న హాజీపై దాడి చేయడం సరికాదని తెలిపారు. ఈ నేపథ్యంలో బాబాయి, అబ్బాయి మధ్య జరుగుతున్న ఈ బేధాభిప్రాయాల పోరాటంతో నగరంలో వైసీపీకి తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోందని ఆ పార్టీ జిల్లా నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నిన్నమొన్నటి వరకు ఇద్దరు నాయకులు నగరంలో ఒకే కార్యాలయం ఉండగా, ఇటీవల ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ మరొక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. రూప్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటిస్తూ, రూప్‌కుమార్‌కు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లా కావలి పర్యటనలో ఈ ఇద్దరి నాయకులను ప్రత్యేకంగా పిలిచి కలిసి పని చేయాలని, పార్టీ ప్రతిష్ఠకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించవద్దని హెచ్చరించినప్పటికీ శుక్రవారం రాత్రి రెండు వర్గాల వారు పరస్పరం దాడులకు దిగారు. దీనిపై వైసీపీ జిల్లా నాయకత్వం, పార్టీ రాష్ట్ర నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి. ఏదేమైనప్పటికీ, బాబాయి, అబ్బాయి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే విధంగా ఉంది.

కొనసాగుతున్న ఎండ తీవ్రత

(మొదటిపేజీ తరువాయి)

కర్నూలు జిల్లా మంత్రాలయంలో 43.5, నెల్లూరు జిల్లా వెంకటాచలంలో 43.3, పల్నాడు జిల్లా రొంపిచర్లలో 43.04, తిరుపతి జిల్లా తొట్టంబేడులో 42.67, ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల చాగలమర్రిలో 42.67, ఉమ్మడి ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో 42.6, కడప జిల్లా కొండాపురంలో 42.5, బాపట్లలో 42.3, చిత్తూరులో 41.82, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 41.8, తూర్పు గోదావరి జిల్లా గోపాలపురంలో 41.4, కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో 41.33, కాకినాడలో 41.2, విజయనగరం జిల్లా పూసపాటి రేగలో 40.8, విజయవాడలో 40.87, గుంటూరు జిల్లా మంగళగిరిలో 40.55, ఏలూరులో 40.5, అనంతపురం జిల్లా గుత్తిలో 40.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో కూడా విపరీతమైన వేడి, ఉబ్బితీయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఆర్-5 జోన్‌లో 'గాలివాన బీభత్సం'

విశాలాంధ్ర-మంగళగిరి: రాజధాని అమరావతిపరిధిలోని ఆర్-5 జోన్‌లో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. నిడమర్రు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న పేదలందరికీ ఇళ్ల లేఅవుట్‌లో తాత్కాలిక షెడ్డు కుప్పకూలి కార్మికులపై పడడంతో దాదాపు 27 మంది కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఆర్-5 జోన్ పరిధిలోని నిడమర్రు గ్రామంలో నిడమర్రు-తాడికొండ డొంక రోడ్డు మార్గంలో పేదలందరికీ ఇళ్ల పేరిట ఇళ్ల స్థలాలు పంచేందుకు ప్రభుత్వం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. సీఆర్‌డీఏ అధికారుల పర్యవేక్షణలో లేఅవుట్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తుళ్లూరు మండలానికి చెందిన సీఆర్‌డీఏ సిబ్బంది పనులు జరిపిస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో కార్మికులు ఉపశమనం పొందేందుకు లేఅవుట్ ఆవరణలో ఇనుప రాడ్లు, అల్యూమినియం రేకులతో తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో కార్మికులంతా షెడ్డు కింద భోజనం చేసేందుకు ఉపక్రమించారు. అప్పటివరకు భగభగలాడిన భానుడు కనుమరుగై మేఘాలు ఆవరించాయి. ఉన్నట్టుండి పెనుగాలి వీచి వర్షం ఆరంభమైంది. వర్షం ధాటికి చుట్టుపక్కల ఉన్న వారు కూడా షెడ్డు కిందకు చేరారు. మనుషులు ఎగిరిపడేంతలా పెనుగాలి బీభత్సం సృష్టించింది. అన్నం ముద్ద నోట్లో పెట్టుకునేలోపే ఆహార పదార్థాలన్నీ ఎగిరిపోయాయి. ఈలోగా పక్కనే ఉన్న చెట్టు విరిగి షెడ్డుపై పడడంతో ఒక్కసారిగా షెడ్డు కుప్పకూలింది. అధికారులు, సిబ్బంది, కార్మికులు షెడ్డు కిందనే చిక్కుకుపోయారు. కార్మికుల హాహాకారాలతో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఒక్కొక్కరుగా షెడ్డు నుంచి బయటికి వచ్చి పరుగులు తీసే ప్రయత్నం చేశారు. నల్లరేగడి మట్టి కావడంతో కొద్దిపాటి వర్షానికే ఆ ప్రాంతమంతా బురదమయమైంది. పరుగులు పెట్టే క్రమంలో అనేక మంది ఆ బురదలో జారిపడి గాయపడ్డారు. ఈలోగా విషయం తెలుసుకున్న సీఆర్‌డీఏ, ఎంటీఎంసీ అధికారులు నిడమర్రు గ్రామానికి హుటాహుటిన బయల్దేరి వచ్చారు. దాదాపు పది అంబులెన్సులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో పిఠాపురానికి చెందిన ఎస్ఐ చెల్లుబోయిన వీరనాగేశ్వరరావు, ఏలూరుకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఐ.విజయరాజు, పాతమంగళగిరికి చెందిన సచివాలయ ఉద్యోగి కె.అశోక్‌కుమార్, రోడ్డు కాంట్రాక్టర్ మువ్వా అభిరామ్, తుళ్లూరు, నెక్కల్లు, రాయపూడి గ్రామాలకు చెందిన సుమారు 20 మంది కార్మికులు గాయపడ్డారు. వీరిలో అనేక మందికి బలమైన గాయాలయ్యాయి.

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్:

ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శనివారం సాయంత్రం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకుని, ఆసుపత్రిలో వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఒక్కసారిగా షెడ్డు కూలిపోవడంతో షెడ్డు కింద ఉన్న వారిలో 27 మంది స్వల్పంగా గాయపడ్డారని చెప్పారు. కొంత మందికి తలకు, కాళ్లకు గాయాలయ్యాయని, వారికి ఎక్స్‌రే, స్కానింగ్‌లు తీయించి డాక్టర్లు వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టరు రాజకుమారి, ఎంటీఎంసీ కమిషనరు యు.శారదాదేవి, డీఈఈ కృష్ణారెడ్డి, తహశీల్దారు జీవీ రామ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నిలకడగా వైఎస్ లక్ష్మీదేవి ఆరోగ్యం

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తల్లి లక్ష్మీదేవి ఆరోగ్యం నిలకడగా ఉంది. తల్లి ఆరోగ్యం విషయంలో అవినాశ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ దగ్గర ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. శుక్రవారం సీబీఐ కోర్టులో అవినాశ్‌రెడ్డి హాజరుకావాలసివుంది. తన తల్లి అస్వస్థతకు గురి కావడంతో ఆమెను కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని విశ్వభారతి సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో చేర్పించి ఐసీయూలో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. శనివారం కూడా డాక్టర్లు పరీక్షలు నిర్వహించి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పినట్లు ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. వైఎస్ లక్ష్మీదేవిని పరామర్శించేందుకు ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు భారీగా తరలి వస్తుండటంతో వైద్యశాల వద్ద రాకపోకలకు అంతరాయం కలిగింది. సీబీఐ అధికారులు కూడా కర్నూలులో ఉన్నారని అవినాశ్‌రెడ్డిని ఏక్షణంలోనైనా అరెస్టుచేస్తారని వదంతులు షికార్లు చేశాయి. మధ్యాహ్నం సమయానికి అవినాశ్‌రెడ్డి వాట్సప్‌కు సీబీఐ అధికారులు సోమవారం 22వ తేది విచారణకు హాజరు కావాలని సందేశం పంపించినట్లు తెలవడంతో ఊపరి పీల్చుకున్నారు. మరో రెండు రోజులు లక్ష్మీదేవిని ఐసీయూలో ఉంచి వైద్యం అందించే అవకాశం ఉందని తెలుస్తోంది.

నకిలీ విత్తనాలను అరికట్టాలి: రామచంద్రయ్య

విశాలాంధ్ర- పత్తికొండ: నకిలీ విత్తనాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక చదువుల రామయ్య భవనం నుంచి రైతు సంఘం ఆధ్వర్యంలో పురవీధుల గుండా ర్యాలీ చేపట్టి, నాలుగు స్తంభాల మండపం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తనాలను అమ్మే కంపెనీలు, షాపుల యజమానులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడం వల్ల, మధ్య దళారీ వ్యవస్థ ద్వారా విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు రోజురోజుకి విపరీతంగా పెరిగి పోతున్నాయని విమర్శించారు. గత సంవత్సరం నకిలీ విత్తనాల ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోయారని, విత్తన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ఎటువంటి పూచికత్తు లేకుండానే బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయశాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కారన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, డి.రాజా సాహెబ్, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి పెద్ద ఈరన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్, వెంకటరామిరెడ్డి ,ప్రజా సంఘాల నాయకులు రంగస్వామి నెట్టికంటయ్య, ఎం.కే సుంకన్న, గుండు భాష, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

- ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఐద్వా, పీవోడబ్ల్యూ డిమాండ్
- ఎన్టీఆర్ జిల్లా జేసీకి 2 లక్షల సంతకాలతో వినతిపత్రం
- బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి: దుర్గా భవాని

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మహిళా మల్లయోధులను లైంగిక వేధించిన కేసులో నిందితుడైన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై పోక్సో, పోష్ చట్టాల కింద చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఐద్వా, పీవోడబ్ల్యూ, ప్రజా సంఘాల అధ్వర్యంలో దిల్లీలో రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా సేకరించిన 2 లక్షల సంతకాలతో పాటు వినతి పత్రాన్ని శనివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని మాట్లాడుతూ మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని గత పది రోజులుగా రెజ్లర్లు నిరసన కొనసాగిస్తున్నారని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా తాత్సారం చేయడం ప్రజలందరూ గమనిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం నిందితుడిపై పోష్, పోక్సో చట్టాల కింద అభియోగాలు మోపకుండా అతన్ని రక్షించాలన్న ప్రయత్నం చేస్తోందని అన్నారు. రెజ్లర్లు ఈ నెల 21 లోపు తమకు న్యాయం జరగకపోతే తమ నిరసనను ఉధృతం చేస్తామని హెచ్చరించారని, మహిళా సంఘాలన్నీ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ప్రజాస్వామ్య విలువలంటే లెక్కలేదని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ప్రజల అభిప్రాయాన్ని తీసుకోవటానికి ముందుకు రావటం లేదని విమర్శించారు. మహిళా సంఘాలన్నీ కలిసి క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరాల్లో గత పది రోజులుగా ప్రజల నుంచి రెండు లక్షల సంతకాలను సేకరించాయని, వాటిని జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అందజేస్తామని తెలిపారు. నిందితుడు బ్రిజ్ భూషణ్‌ను రక్షించడానికి అధికార యంత్రాంగం అండగా ఉందన్న విషయం అర్థమవుతోందన్నారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి, పార్లమెంటు సభ్యునిగా సస్పెండ్ చేయాలని, భారత మల్ల యోధుల సంఘం అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని, పోష్, పోక్సో చట్టాలను సక్రమంగా అమలు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని, మహిళ మల్లయోధులకు న్యాయం చేయాలని దుర్గా భవాని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు ప్రభుత్వం నుంచి తక్షణమే సానుకూలత వస్తుందని మహిళా సంఘాలు ఆశిస్తున్నాయని అన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ దేశానికి పతకాలు తెచ్చిన మహిళలను చెరపట్టేటువంటి నాయకుడికి బీజేపీ అండగా ఉండటమనేది అంతర్జాతీయంగా దేశ ప్రజలకు అగౌరవాన్ని తెచ్చిపెట్టేదిగా ఉందన్నారు. బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగాభవాని మాట్లాడుతూ భారతదేశం మహిళలకు అత్యంత రక్షణ లేని దేశంగా ఉందన్నారు. కతువా, ఉన్నావ్ ఘటనలు, రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితులను రక్షించాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వ తీరు మనకు అర్థమవుతోందని తెలిపారు. నిందితుడిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ, ఐద్వా నగర కార్యదర్శి కె.శ్రీదేవి, స్వప్న, పీవోడబ్ల్యూ నగర కార్యదర్శి పద్మ, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు లంక గోవిందరాజులు, నగర ఉపాధ్యక్షుడు లంకె సాయి కుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రామన్న, నగర నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి సీపీఐ: ముప్పాళ్ల

విశాలాంధ్ర-క్రోసూరు: కార్మికుల పక్షపాతి సీపీఐ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన క్రోసూరులో శనివారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆనాటి నుంచి ఈనాటి వరకు కార్మికుల, కర్షకుల పక్షాన ఎర్రజెండా పోరాటాలు చేస్తోందని చెప్పారు. సీపీఐ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజల సమస్యలు అధ్యయనం చేసి ప్రజల పక్షాన పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఈనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలపై పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు రోజుకు పెంచుకుంటూ పోతూ ప్రజలపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, రైతు సంఘం కార్యదర్శి కంచిటి పెద్దబ్బాయి, మండల సీపీఐ కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, యువజన సమాఖ్య నాయకులు పి.నాగరాజు, శేఖరం, ఆంజనేయులు, పాండు యాదగిరి, హమాలీలు సంఘం నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా

విస్సన్నపేట భూ కబ్జాపై మంత్రి అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విస్సన్నపేటలో అరసెంటు భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటా నని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. శనివారం విశాఖపట్నం సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అనకాపల్లిలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ అమరావతి రాజధానిగా ఉండాలని జనంతో చెప్పించే ప్రయత్నం చేశారని, అంటే, చంద్రబాబుకు విశాఖపట్నంపై ఎంత ద్వేషం ఉందో అర్థమవుతోందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమరావతిని ఎప్పుడూ పక్కన పెట్టలేదని, దానిని కూడా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారని స్పష్టం చేశారు. విస్సన్నపేట గ్రామంలో 609 ఎకరాల భూమిని కబ్జా చేశానని చంద్రబాబు నాపై విమర్శ చేశారని, ఆ కబ్జాని నిరూపిస్తానని కూడా సవాలు విసిరారని అన్నారు. ఆ సవాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. అందులో అర సెంటు భూమినైనా తానుగానీ, తన కుటుంబ సభ్యులుగానీ ఆక్రమించినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి వైదొలుగుతానని, నిరూపించకపోతే లోకేశ్‌ను రాజకీయాల నుంచి తప్పిస్తారా అని మంత్రి అమర్‌నాథ్... చంద్రబాబుకు ప్రతి సవాలు విసిరారు. షుగర్ ఫ్యాక్టరీల మూసివేత గురించి మాట్లాడడానికి చంద్రబాబు నాయుడుకు అర్హత లేదని, ఆయన హయాంలోనే షుగర్ ఫ్యాక్టరీలకు తాళాలు వేశారన్నారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్‌కు అవసరమైన చెరకు లభ్యత లేదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గుర్తించి దాని స్థానంలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. అలాగే విద్యుత్ చార్జీల పెంపు గురించి చంద్రబాబు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని, ఆయన హయాంలోనే విద్యుత్ చార్జీలను భారీగా పెంచి, ప్రశ్నించిన వారిని తుపాకీలతో కాల్చి చంపిన ఘటనను చంద్రబాబు మర్చిపోయినా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు మర్చిపోలేదని అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రాబల్యం తగ్గుతోందని గమనించి ఎన్టీఆర్‌ను మళ్లీ తెరమీదకు తీసుకువస్తున్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కనీసం ఒక్క జిల్లాకైనా ఎన్టీఆర్ పేరు పెట్టారా అని ప్రశ్నించారు.

ఏసీబీ వలలో అవినీతి చేప

- ఈపీడీసీఎల్ ఏడీఈ ఇంట్లో సోదాలు
- భారీగా అక్రమాస్తుల గుర్తింపు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు అవినీతి చేప చిక్కింది. ఈపీడీసీఎల్ ఏడీఈ సన్ని రాంబాబు అవినీతి అధికారి అని తెలిసి ఆయన ఇల్లు, కార్యాలయాన్ని అధికారులు తనిఖీ చేశారు. భారీగా అక్రమాస్తులు ఉండటాన్ని గుర్తించారు. 14400 కాల్‌సెంటర్, ఏసీబీ యాప్ ద్వారా అందిన సమాచారం మేరకు అనకాపల్లి జిల్లా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రాంబాబు వద్ద అదాయానికి మించి ఆస్తులుండటాన్ని ఏసీబీ అధికారుల గుర్తించారు. దీంతో వారు రాంబాబు గాజువాక నివాసంలో శనివారం తనిఖీలు చేపట్టారు. ఆయన కార్యాలయం, బంధువుల ఇళ్లల్లోనూ సోదా చేశారు. రాంబాబుకు గాజువాకలో 11ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్, మూడు అంతస్తుల భవనం, శివాజీపాలెంలో ఫ్లాట్, మల్కాపురంలో మూడు అంతస్తుల భవనం, మల్కాపురంలో రెండు అంతస్తుల భవనం, భోగాపురంలో 11సెంట్ల భూమి, ఒక స్కోడా కారు, 927.08 గ్రాముల బంగారం, నగలు, 2156 గ్రాముల వెండి వస్తువులు, రెండున్నర లక్షల నగదు, వెస్పా స్కూటీ, పల్సర్ బైక్, వివిధ బ్యాంకుల పాస్‌బుక్‌లు లభించాయని అధికారులు తెలిపారు. బంధువుల ఇళ్లలో జరిపిన సోదాల్లో రూ.2,51,130, బంగారం, వెండి, ఆస్తుల దస్తావేజులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చరిత్ర కనుమరుగు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చరిత్రను కనుమరుగు చేస్తోందని వక్తలు విమర్శించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్‌సీఈఆర్‌టీ, సీబీఎస్ఈ పాఠ్యాంశాలలో తెచ్చిన అసంబద్ధమైన మార్పులపై శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అల్లూరి విజ్ఞాన కేంద్రం, జన విజ్ఞాన వేదిక, సౌత్ ఇండియా ఎలియన్స్ ఫర్ ఫండమెంటల్ రైట్ టు ఎడ్యుకేషన్, సైన్స్ టీచర్స్ ఫోరం,సోషల్ టీచర్స్ ఫోరంలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సమావేశంలో మాజీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ బాలమోహన్ దాస్, మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం, ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, ఫోరం ఫర్ ఫండమెంటల్ రైట్ టు ఎడ్యుకేషన్ నరవ ప్రకాశరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా సీబీఎస్ఈ సిలబస్‌లో తెస్తున్న అసంబద్ధ మార్పులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మొఘల్ చక్రవర్తుల పాలన, గాంధీజీ హత్యకు సంబంధించిన అంశాలు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ ప్రథమ విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు సంబంధించిన భాగాలు, సైన్స్‌లో డార్విన్ జీవ పరిణామ వాదం, మెండలీవ్ పీరియాడిక్ టేబుల్‌ను, అలాగే ప్రజాస్వామ్యం, వైవిధ్యం, ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లు వంటి అనేక కీలకమైన అంశాలను తొలగించడం సరికాదని వక్తలు తీవ్రంగా దుయ్యబట్టారు. భారతదేశ చరిత్రలో అంతర్భాగంగా ఉన్న సుల్తానుల, మొఘల్ చక్రవర్తుల పాలనా కాలాన్ని తొలగించడమంటే కొన్ని శతాబ్దాల పాటు జరిగిన చరిత్ర విషయంలో భావితరాలను చీకటిలో ఉంచడమే అవుతుందని, చారిత్రక వికాస వారసత్వాన్ని భావితరాలకు నిరాకరించడమే అవుతుందని విమర్శించారు. జాతీయ ఉద్యమాన్ని విషయం నిరూపితమైందని, దానికి సంబంధించిన అధ్యాయాలను తొలగించడం హేయమని అన్నారు. డార్విన్ జీవ పరిణామవాదం తొలగించడం వలన జీవుల పుట్టుక, పరిణామం, వర్గీకరణ వంటి అనేక కీలక అంశాలపై విద్యార్థులకు అవగాహన లేకుండా పోతుందని, దేశంలో వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలను రూపొందించే 'విజ్ఞాన్ ప్రసార్'ను మూసివేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వీటన్నింటికీ పరాకాష్ట అని అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల కన్నా, భావితరాలకు సరైన శాస్త్రీయ చారిత్రక విద్యను అందించడంకన్నా తన సొంత హిందుత్వ అజెండాకే ప్రాధాన్యత ఇచ్చి మోదీ ప్రభుత్వం భావితరాల పురోగతిని శాశ్వతంగా దెబ్బతీస్తోందని విమర్శించారు. ఇటువంటి కీలక సమయంలో కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ మార్పుల పట్ల తీవ్ర అభ్యంతరాలను ప్రకటించడమే కాకుండా కేరళ ప్రభుత్వం తమ రాష్ట్రంలో ఈ మార్పులను అమలు చేయబోవడం లేదని స్పష్టంగా ప్రకటించిందని తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర సిలబస్‌ను యథాతథంగా అమలు చేయ దానికి పూనుకోవడం అత్యంత నష్టదాయకమని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని లౌకిక, పురోగామిక శక్తులు, వ్యక్తులు, విద్యావేత్తలు, మేధావులు ముందుకు వచ్చి మన శాస్త్రీయ లౌకిక విద్యకు ఏర్పడుతున్న తీవ్ర ముప్పును తిప్పికొట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల వలే సిలబస్‌లోని అశాస్త్రీయ మార్పులకు వ్యతిరేకంగా నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించిందన్నారు. అవగాహన సభలు, సమావేశాలు, సదస్సులు, కరపత్రాల ద్వారా ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్, ఉపాధ్యాయ రంగానికి చెందిన రాము, పద్మ, కమల రత్నం, వైఆర్‌కే ప్రసాద్, సుందరరావు, రామకృష్ణ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం నాయకులు ఎస్.వి.కె.పరశురామ్, జేవీవీ జిల్లా అధ్యక్షులు గోపాలరావు, శేషగిరిరావు పాల్గొని సిలబస్‌లో మార్పులను వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలు తెలిపారు. నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించిన ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని అల్లూరి సీతారామరాజు కార్యక్రమాల ఇన్‌ఛార్జ్ జి.ఎస్.రాజేశ్వరరావు వందన సమర్పణతో ముగించారు.

మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

విశాలాంధ్ర -భీమవరం: 2008 డీఎస్సీ ద్వారా ఎంపికై మినిమం టైం స్కేల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. 2008 టైం స్కేల్ ఉపాధ్యాయులు శనివారం సాయి శ్రీనివాస్‌ను కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో మినిమం టైమ్స్ స్కేల్‌లో నియమించి కేవలం 10 నెలల కాలానికి జీతాన్ని చెల్లిస్తూ వేసవి సెలవుల్లో రెండు నెలలు కాలానికి జీతం లేకుండా ఖాళీగా ఉంచడం దారుణమన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది అందరికీ కేవలం ఒకరోజు బ్రేక్ ఇచ్చి పూర్తిస్థాయిలో 12 నెలల జీతాన్ని చెల్లిస్తున్నారని ఆ విధంగానే 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి సాయి వర్మ, జిల్లా అధ్యక్షులు జవహర్‌లాల్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు, ఆర్థిక కార్యదర్శి వి.జనార్ధన రావు, వైవీరామకృష్ణ, బి.మురళీకృష్ణ, ఎం.వెంకటరమణ, ఎం.నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఏపీ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

రాష్ట్ర అధ్యక్షులుగా రజాక్, ప్రధాన కార్యదర్శిగా వెంకట సత్యనారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (384/2022) రాష్ట్ర అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూన వెంకట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కార్ రావు హాజరయ్యారు. సభ్యుల సమక్షంలో ఏపీ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగింది. సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూన వెంకట సత్యనారాయణ, సహ అధ్యక్షులుగా వరప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చక్రపాణి నాయుడు, ఇందురుపల్లి మణి, మస్తాన్, రాష్ట్ర కార్యదర్శిగా లక్ష్మినారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా మధులత, అయ్యప్ప, పార్థా మధు, ఆదిమూర్తి, కార్యవర్గ సభ్యుడిగా కెనడీ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగా ఏర్పడిన సంఘం సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాబోయే మూడు సంవత్సరాల పాటు పని చేస్తుంది. రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక అనంతరం, రాష్ట్రంలోని 21 జిల్లాలకు జిల్లా కమిటీలను రాష్ట్ర అధ్యక్షులు రజాక్ ప్రకటించారు. సమావేశానికి హాజరయిన కె.ఆర్.సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, మొదటి, రెండవ నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యంగా చేసినందున రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌంతి ఆస్కార్ రావు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు తక్షణమే సాధారణ బదిలీలు, అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని, యూనిఫాం విధానాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులపై స్పష్టత కల్పించి వాటిని సర్వీసు రూల్స్‌లో పొందుపరచాలని, అలాగే సమస్యల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. 12వ పీఆర్సీలో సచివాలయ ఉద్యోగులకు మెరుగైన వేతన సవరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో మే 22 నుంచి జరగబోయే ఉద్యమ కార్యాచరణకు పూర్తిగా మద్దతు ఇస్తున్నామని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు ఈ కార్యాచరణలో పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు జాబ్ కార్డ్ ప్రకారం రావలసిన అధికారాలు ఇవ్వాలని, డిపార్ట్‌మెంట్ సిమ్ కార్డులు ఇవ్వాలని, పండుగలు, సెలవు దినాల్లో డ్యూటీలు కేటాయించకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించి, తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

29-31 తేదీల్లో ఉత్తరాంధ్రలో

ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులు

నూతన విద్యావిధానం అమలు చేయొద్దు: జాన్సన్‌బాబు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ఉత్తరాంధ్రలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు తెలిపారు. విద్యా, వైజ్ఞానిక, రాజకీయ అంశాలపై శిక్షణ ఉంటుందని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాన్సన్ బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అమర్‌భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జాన్సన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన విద్యావిధానాన్ని అమలు చేయరాదని డిమాండ్ చేశారు. దీనిని ఏఐఎస్ఎఫ్ రాష్ట్రశాఖ వ్యతిరేకిస్తోందని అన్నారు. విద్య కాషాయీకరణ, పిల్లల మదిలో మతబీజాలు నాటే ఈ విధానం అమలు చేయొద్దని కోరారు. పేదలు, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికే 2650 పాఠశాలు విలీనమయ్యాయని, టీచర్ల పోస్టులు ఖాళీ అయ్యాయని, డ్రాపౌట్లలో బాలికల సంఖ్య పెరిగిందని తెలిపారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి అని జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్ నాగభూషణం సహాయ కార్యదర్శులు పి.గౌరీశంకర్, బి.వాసు, పట్టణ అధ్యక్షులు ఎ.సుమన్, నేతలు రమేశ్, సతీశ్, పవన్, నాగరాజు పాల్గొన్నారు.

సంపాదకీయం

వికటించిన మందే మళ్లీ

వికటించిన వైద్యాన్నే మోదీ సర్కారు మళ్లీ ఆశ్రయించింది. ఆరున్నరేళ్ల కింద 2016 నవంబర్ 16 రాత్రి ఎనిమిది గంటలకు ప్రధానమంత్రి మోదీ రేడియో, టీవీల్లో ప్రత్యక్షమై వెయ్యి, 500 రూపాయల నోట్లు ఆ రాత్రి 12గంటల తరవాత చెల్లవని ప్రకటించి అందరినీదిగ్భ్రాంతికి గురిచేశారు. దీనివల్ల ప్రధానంగా సామాన్యులు ఇబ్బందిపడ్డారు. ఆ విధానం నల్ల డబ్బును వెలికి తీయడానికి ఏం మాత్రం ఉపకరించలేదు. ఎన్ని నోట్లు చెలామణిలో ఉండేవో దాదాపు అన్ని నోట్లు రిజర్వు బ్యాంకుకు చేరాయి. వీటిలో నల్లవేవో, తెల్లవేవో ప్రభుత్వంగానీ, రిజర్వు బ్యాంకు గానీ ఎప్పుడూ చెప్పలేదు. పెద్దనోట్లను రద్దు చేస్తున్నామని ప్రకటించిన కేంద్రం ఈ పరిణామంతో డబ్బు చెలామణి తగ్గి జనం ఇబ్బంది పడ్తున్న నేపథ్యంలో రెండువేల రూపాయలను ముద్రించింది. నల్లధనాన్ని చెలామణిలో లేకుండా చేయడం, తీవ్రవాదాన్ని కట్టడం చేయడం, నకిలీ నోట్లను కట్టడి చేయడం నోట్ల రద్దుకు ప్రధాన లక్ష్యాలని అప్పుడు మోదీ ప్రకటించారు. ఈ లక్ష్యాల్లో ఏవి ఎంతవరకు నెరవేరాయో లెక్క మాత్రం తేల్చలేదు. అంటే సాధించిన ఫలితం ఏమీలేనట్టే. జనం మాత్రం కష్టాల పాలయ్యారు. రోజుల తరబడి అనేక గంటల పాటు బ్యాంకుల ముందు నిలబడాల్సి వచ్చింది. ఈ క్రమంలో కనీసం వందమంది ప్రాణాలు పోయాయి. ఇప్పుడు రెండు వేల రూపాయల నోట్లు రద్దు చేసినప్పుడు వీటిని మార్చుకోవడానికి మరింత వెసులుబాటు ఇచ్చారు. వచ్చే మంగళవారం నుంచి మొదలు పెట్టి సెప్టెంబర్ 30దాకా మార్చుకోవచ్చు. అయితే ఇలా మార్చుకోవడానికి ఓ పరిమితి ఉంది. ఒక విడత పదినోట్లు మాత్రమే మార్చుకోవడానికి వీలుంటుంది. అపారంగా ఈ నోట్లను దాచినవారు అన్నింటినీ మార్చుకోవడం కుదరకపోవచ్చు. ఇంతకు ముందు పెద్ద నోట్లను రద్దు చేసిన ప్రభుత్వం అంతకన్నా పెద్ద నోట్లను విడుదల చేయడంలో ఆంతర్యం ఏమిటో అంతుబట్టలేదు. నిజానికి రెండు వేల రూపాయల నోట్లు దాచుకోవడం సులభమైంది. 2016లో పెద్ద నోట్ల రద్దు విషయం అప్పటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి కూడా తెలియదనే వారు. ఇప్పుడు మాత్రం మోదీ విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు రిజర్వు బ్యాంకు శుక్రవారం రెండువేల రూపాయల నోట్ల ఉపసంహరణ విషయం బయట పెట్టింది.

రెండువేల నోట్లు విడుదలైన తరవాత చెలామణిలో ఉన్న మొత్తం కరెన్సీ 18037 బిలియన్ డాలర్లు. ఇది చెలామణిలో ఉన్న మొత్తంలో 37.3 శాతం. వాస్తవానికైతే అప్పుడూ ఈ విషయం రిజర్వు బ్యాంకు నోటే ద్వారానే రావలసింది. కానీ ఇది మహత్తర కార్యమని భావించిన మోదీ తానే ప్రకటించారు. రెండువేల రూపాయల నోట్లను భారీగా డబ్బు దాచుకునే వారికి దివ్యంగా ఉపయోగ పడుతుందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎస్.సి. గార్గ్ గత సంవత్సరమే హెచ్చరించారు. విచిత్రం ఏమిటంటే రెండు వేల రూపాయల నోట్లను రద్దు చేసే ఉద్దేశం లేదని గత డిసెంబర్‌లో పార్లమెంటులో ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఇంతలోనే మారిన పరిస్థితి ఎంత తీవ్రమైందో మాత్రం కేంద్ర ప్రభుత్వం చెప్పలేదు. ఈ నోట్లు దొంగచాటుగా డబ్బు దాచుకునే వారికి వర ప్రసాదమైనాయి. అంటే ఇవి సంపన్నులకే ఉపయోగపడ్డాయి. రెండు వేల రూపాయల నోట్లు సామాన్యులను ఇబ్బంది పాలు చేశాయి. చిల్లర మార్చుకోవడమూ సమస్య అయింది. ప్రస్తుతం నోట్ల ఉపసంహరణ, వాటిని మార్చుకోవడానికి కల్పించిన వెసులుబాటు నల్లధనం ఉన్న వారికే మరోసారి ఎక్కువ ప్రయోజనం కలిగిస్తుంది. ఇది గతంలో మోదీ అనాలోచితంగా పెద్ద నోట్లను రద్దు చేయడంవల్ల సంపన్నులకు, ధన రాశులు దాచుకున్న వారికి ఉపకరించిన దానికన్నా ఎక్కువ ప్రయోజనమే చేకూరుస్తుంది. మోదీ ఆరున్నరేళ్ల కింద పెద్ద నోట్లు రద్దుచేసినప్పుడు ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. లక్షలాది ఉద్యోగాలు పోయాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కకావికలైనాయి. వీటిలోనే ఎక్కువ ఉపాధి కల్పించే అవకాశం ఉండేది. 500, వెయ్యి నోట్లను రద్దు చేసినప్పుడు నల్లధనం ఏమన్నా వెలికి వచ్చిందా అంటే అదీ లేదు. 2016లో రద్దు చేసిన నోట్లలో 99.3 శాతం రిజర్వు బ్యాంకుకు చేరాయి. అంటే ప్రత్యక్షంగా నల్లధనం అని తేలిందేమీ లేదు. ఇప్పుడూ నల్లధనం తగ్గే అవకాశాలు ఏమీ ఉండవు. రెండువేల నోట్ల ఉపసంహరణ వల్ల నల్లధనం ఉన్నవారు లబ్ధి పొందకుండా కట్టుదిట్టం చేస్తామంటున్నారు. 2016లో రద్దుచేసినప్పుడు చెదురు మదురుగా కొంతమంది మీద దాడులు జరగడం తప్ప పెద్దగా సాధించింది ఏమీ లేదు. 2016లో విధించిన నిబంధనల ప్రకారం ఎక్కువ నోట్లు మార్చుకోవడానికి వీల్లేదన్నారు. ఒక రోజు కేవలం నాలుగు వేల రూపాయల విలువగల నోట్లే మార్చుకోవచ్చన్నారు. బ్యాంకులో ఉన్న తమ డబ్బులో రూ.20,000 తీసుకోవచ్చునన్నారు. ఇవన్నీ పేదలనే ఇబ్బందుల్లో పడేశాయి. తాము కష్టపడి సంపాదించిన సొమ్ము కూడా వాడుకునే వీలు లేకుండా పోయింది. ఈసారి కూడా ఒక్క విడతలో మార్చుకోగలిగిన మొత్తం ఇరవై వేలే. అలా ఎన్ని విడతలైనా ఒక్కరేజే మార్చుకోగలగడం సంపన్నులకే ప్రయోజనం. ఇది నల్లడబ్బు తెల్లగా మార్చుకోవడానికి ఉపకరిస్తుంది.

అసలు ఇప్పుడు నోట్ల ఉపసంహరణ ఆంతర్యం ఏమిటో తెలియదు. చిరిగిపోయిన, నలిగిపోయిన నోట్లను వెనక్కు తీసుకోవడానికే అని రిజర్వు బ్యాంకు వాదన నమ్మశక్యంగా లేదు. అదే కారణం అయితే పాతనోట్లు ఇచ్చి కొత్త నోట్లు తీసుకోమనొచ్చుగా. నల్లడబ్బు, తీవ్రవాదం, నకిలీ నోట్ల ప్రస్తావన ఇప్పుడు చేయడం లేదు. ప్రధాన మంత్రి మోదీ పనితీరు చూస్తే మొదట ఏదో ఓ పని చేసేసి తరవాత ఆలోచిస్తారు. మళ్లీ వెయ్యి రూపాయల నోట్లు వచ్చినా ఆశ్చర్యపడక్కర్లేదు. నోట్లు ఎక్కువగా చెలామణిలో ఉంటే అవినీతి అంతగా పెరుగుతుందన్నది మోదీ సిద్ధాంతం. అలాగైతే 2016లో చెలామణిలో ఉన్న నోట్లు 17.7 లక్షల కోట్లు అయితే ఇప్పుడు 30.18 లక్షల కోట్ల నోట్లు చెలామణిలోకి వచ్చాయి. దీని బాధ్యత ప్రభుత్వానిదేగా. చేసిన తుగ్లక్ పనే పదేపదే చేయడం అంటే ఇదే. పరిణామాల గురించి ఆలోచించకుండా కొత్త విధానాలు అమలు చేయడం మోదీ శైలి. ఈ సారి తీసుకున్న నిర్ణయం మెరుగైన ఆర్థిక విధానమూ కాదు. సముచిత ఆలోచనా కాదు.

జీవ వైవిధ్య సంక్షోభం మానవాళికి ప్రమాదం

కొన్ని బిలియన్ ఏండ్లకు పూర్వమే ఏర్పడిన భూగోళంపై నివసిస్తున్న 8 మిలియన్ల జీవరాసుల (వృక్షాలు, జంతువులు, ఫంగీ, బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు) మనుగడకు భంగం కలుగకుండా పరిరక్షించుకుంటూ, పర్యావరణ (అడవులు, ఎడారులు, చిత్తడి నేలలు, పర్వతాలు, సరస్సులు, నదులు, చెరువులు, వ్యవసాయ భూములు) సమతుల్యతను పాటిస్తూ, మానవ మనుగడ సాగించడమే జీవవైవిధ్యం. సుస్థిర వ్యవసాయం, ఎడారీకరణ, నేల క్షీణత, మహాసముద్రాలు, గిరిజన జాతులు, ఆహార భద్రత, కరువులు, నీరు లభ్యత, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, అంటువ్యాధులు, జీవనోపాధి, సుస్థిరాభివృద్ధి, శక్తి వనరులు, శాస్త్రసాంకేతికత, సృజనశీలత, విజ్ఞాన వినిమయం, పట్టణీకరణ, రవాణా, వాతావరణ మార్పులు, విపత్తు నిర్వహణ, అడవులు, పేదరికం లాంటి అనేక అంశాలు జీవ వైవిధ్యం మీదనే ఆధారపడి ఉంటాయి.

ఐరాస నిర్దేశించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల'లో జీవ వైవిధ్యానికి పెద్ద పీటవేశారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడానికి కారణం మానవుడి అనాలోచిత, స్వార్థపూరిత చేష్టలే. కళ్ళు తెరవాల్సిన సమయం ఆసన్నమైంది. జీవ వైవిధ్యానికి విఘాతం కలిగితే జరిగే అనేక అనర్థాలలో నేడు మనం అనుభవిస్తున్న మహమ్మారుల కల్లోలం కూడా ఒక ప్రధాన భాగం. జీవ వనరులను, ప్రపంచ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం మన కర్తవ్యం. ప్రకృతిలో ప్రధాన భాగాలైన వృక్ష సంపద, జంతు జాతులు, అనేక రకాలైన సూక్ష్మజీవులు, జన్యు వైవిధ్యం లాంటివి పర్యావరణ సురక్షకు సోపానాలు. కాలానుగుణంగా మానవాళి ప్రమేయంతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంలో భాగంగా జీవ వైవిధ్యానికి తీవ్ర విఘాతం కలుగుతూనే ఉంది. భూమండలంపై 66 శాతం సముద్ర జలాలున్నాయి. ఇవి కలుషితమవుతున్నాయి. మానవ అనాలోచిత కార్యాలతో సముద్ర జీవరాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని గమనించాలి. ఇలాంటి పర్యావరణ విచ్ఛిన్న కార్యాల ద్వారా ఒక మిలియన్ జీవరాసులు అంతరించే దుస్థితి ఏర్పడింది.

ప్రపంచంలో 3 బిలియన్ల జీవులు జలాల్లో, 1.6 బిలియన్ జీవరాసులు అడవుల్లో మనుగడ సాగిస్తున్నాయి. సకల జీవుల మనుగడకు రక్షణ కలగాలన్నా, కరోనా లాంటి మహమ్మారుల ద్వారా సోకే అంటువ్యాధులను నియంత్రించాలన్నా జీవ వైవిధ్య పరిరక్షణ చర్యలు విధిగా జరగాల్సిందే. జీవ వైవిధ్యాన్ని విచ్ఛిన్నం చేస్తే 70 శాతం వరకు జంతు సంబంధ జెనెటిక్ వ్యాధులు ప్రబలుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రకృతిలో సహజ సిద్ధంగా మనుగడ సాగిస్తున్న వృక్ష, జంతుజాల సమతుల్యతకు భంగం కలిగించే ఎలాంటి చర్యలు చేయరాదు. మానవ అకారణ, అనాలోచిత క్రియలతో కొన్ని జీవరాసులు అంతరించిన యెడల వాటిపై ఆధారపడే వ్యాధికారక సూక్ష్మ క్రిములు మనవాళికి సోకడంతో భయంకర అంటురోగాలు కలుగుతాయి. జీవ వైవిధ్యం విచ్ఛిన్నమైతే వాతావరణ ప్రతికూల మార్పులు కూడా కలుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి గంటకు కనీసం 3 జీవ జాతులు, రోజుకు 100 - 150, ఏడాదికి 15,000 - 18,000 జీవజాతులు అంతరిస్తున్నాయని తేలింది. బీడు భూములు పెరగడంతో 74 రకాల కప్ప జాతులు, ధృవాల వద్ద మంచు కరగడంతో 22 శాతం పోలార్ బేర్‌లు, అంటార్కిటికాలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పెంగ్విన్‌లు, నెదర్లాండ్స్‌లో వాతావరణ మార్పులతో ఫ్లైకాచర్ పక్షులు లాంటి అనేక జీవ జాతులు అంతరించే సమయం ఆసన్నమైందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బి. మధుసూదన్ రెడ్డి, సెల్: 9949700037

కర్నాటకలో సత్తా చూపిన పాల రైతులు!

అమూల్ పాల కంపెనీ గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థ. ప్రభుత్వాలు చేయాల్సింది పాలన తప్ప పాలు, నీళ్లు, చింతపండు, ఉల్లిపాయల వంటి వాటిని అమ్మటం కాదు. కనుక గతంలో ఏం జరిగినా ప్రభుత్వ రంగంలో ఉన్న వీటికి సంబంధించిన సంస్థలన్నింటినీ అమ్మి సొమ్ము చేసుకోవాలన్నది కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ విధానం. అఫ్‌కోర్స్ ఇది కాంగ్రెస్ విధానమే, కాకపోతే తాను జన్మించింది దాని కోసమే అన్నట్లుగా దాన్నే మరింత భక్తి శ్రద్ధలతో మోదీ అమలు జరుపుతున్నారు. అందువలన అన్నింటినీ తెగనమ్మిన తరువాత అమూల్‌ను కూడా అమ్మకుండా మరోసారి అధికారం అప్పగిస్తే నరేంద్రమోదీ లేదా వారసులు ఊరుకుంటారా ? ఒకసారి అపని జరిగాక విదేశాల నుంచి చౌకగా దొరికే పాలు, పాల పదార్ధాలను మన మీద రుద్దుతారు. పాలతో కొంత రాబడి కోసం ఆవులు, గేదెలను మేపే రైతుల నోట్లో అప్పుడు మట్టే. కర్నాటక నందిని పాల సంస్థను మూతపెట్టి అమూల్‌కు మార్కెట్‌ను కట్టబెట్టేందుకు కర్నాటకలోని బీజేపీ పాలకులు యత్నించడాన్ని అక్కడి రైతులు జీర్ణించుకోలేకపోయారు. పాల రైతులకు మేలు చేసేందుకు గాను తమకు తిరిగి అధికారం అప్పగిస్తే జనాలకు రోజుకు అరలీటరు పాలు సరఫరా చేస్తామని బీజేపీ నమ్మబలికింది. మీ పాల సంగతి తరువాత అంటూ ఆ బీజేపీని పాల రైతులు కావేరీ, కృష్ణ నీళ్లలో ముంచి గుణపాఠం చెప్పారు.

గతేడాది డిసెంబరులో పాల రైతులు ఎక్కువగా ఉన్న మాండ్య జిల్లా కేంద్రంలో జరిపిన సభలో కేంద్రమంత్రి అమిత్ షా పాల వివాదానికి తెరతీశారు. పాల రైతుల సంక్షేమానికి కర్నాటక నందిని, గుజరాత్ అమూల్ పాల సంస్థలు కలసి పని చేయాలని చెప్పారు. నందిని పాలు కనుమరుగు కానున్నాయనే అనుమానం కర్నాటక రైతుల్లో తలెత్తింది. అదేమీ కాదని 40శాతం కమిషన్ సిఎం బొమ్మై మొదలు ఎందరు బీజేపీ పెద్దలు సంజాయిషీ ఇచ్చుకున్నా రైతులు నమ్మలేదు. అవకాశంకోసం ఎదురు చూశారు. చేయాల్సింది చేశారు. బెళగావి, హసన్, తుంకూరు, మైసూరు, మాండ్య జిల్లాలు పాల ఉత్పత్తికి ప్రసిద్ధి. ఈ ఐదు జిల్లాల్లో 54 అసెంబ్లీ స్థానాలుండగా కాంగ్రెస్ 33 గెలుచుకుంది. గతంలో పదకొండు ఉన్నాయి. బీజేపీ బలం 21 నుంచి 12కు తగ్గింది. జెడిఎస్ కూడా సీట్లను పొగొట్టుకుంది. గతంలో జరిగిన సర్వే ప్రకారం దేశంలోని 20 రాష్ట్రాల్లో పాల ఉత్పత్తిలో కర్నాటక 9వ స్థానంలో ఉంది. గుజరాత్ తరువాత పాలను సహకార సంస్థలకు ఎక్కువగా అమ్మే రాష్ట్రంగా కర్నాటక ఉంది. గ్రామీణ

ప్రాంతాల్లో కాంగ్రెస్ గతం కంటే ఏడుశాతం ఓట్లను అదనంగా పొందింది. రాష్ట్రమంతటా బీజేపీ మద్దతుదారులుగా ఉన్న లింగాయత్ సామాజిక తరగతి ఓటర్లలో వచ్చిన మార్పుకూడా దీనికి దోహదం చేసింది.

ప్రజలకు పాలు సరఫరా చేస్తామని బీజేపీ వాగ్దానం చేసింది. అది ఉచితం కాదు, ఆరోగ్యాన్ని కాపాడేందుకు, పాల రైతులకు లబ్ధి చేకూర్చేందుకు, మార్కెట్‌ను పెంచేందుకు అని బీజేపీ నేతలు టీవీ చర్చల్లో సమర్ధించుకున్నారు. అదే పని గత మూడున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉండగా కర్నాటక బీజేపీ గానీ, గుజరాత్ సహా ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గానీ ఎందుకు అమలు జరపటం లేదన్న ప్రశ్నకు సమాధానం లేదు. కర్నాటక ఎన్నికల ప్రచారం మొదలైనపుడే ఏప్రిల్ నాలుగవ తేదీన రాయిటర్స్ వార్తా సంస్థ ఇచ్చిన ఒక వార్త ప్రకారం గత దశాబ్ది కాలంలో ఎన్నడూ లేనివిధంగా గతేడాది కాలంలోనే 15శాతం పాలధరలు పెరిగాయి. ఇది ద్రవ్యోల్బణం పెరుగుదలకు కూడా దోహదం చేసింది. దాంతో ధరలు తగ్గించే పేరుతో విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే పాలు, పాల ఉత్పత్తుల మీద దిగుమతి పన్నులను రద్దు చేసింది. ఇది పాల వినియోగదారులకు కాస్త ఉపశమనం కలిగించినా అదే విధానాన్ని కొనసాగిస్తే మన పాడి పరిశ్రమ మూతపడుతుంది. డాలర్లు చెల్లించి చమురుతో పాటు పాలు, పెరుగు కూడా కొనుక్కోవాల్సి ఉంటుంది. రైతులకు తగిన గిట్టుబాటుధర రాకపోతే పాడి తగ్గుతుంది. ధర పెరిగితే పోషకాహారం కొనుగోలూ తగ్గుతుంది. మాంసం కోసం ఆవులను వధించారని ఆరోపిస్తూ మూక దాడులు చేసి ప్రాణాలు తీసేందుకు వెనుకాడని గో వంశ రక్షక, గో రక్షక దళాలను చూశాము. ఈ కాషాయ దళాలు మేతలేక కృశించి, రోగాలతో మరణించే ఆవుల సంరక్షణ గురించి మాట్లాడవు. పాలు ఇవ్వని వాటిని, మేపలేక ఎవరైనా వధశాలలకు అమ్ముకోవటానికి వీల్లేకుండాచేశారు. రోడ్లమీద వదలివేస్తే కొత్త సమస్యలను ముందుకు తెచ్చాయి. మెజారిటీ రాష్ట్రాలు, కేంద్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ ఆవులకు సోకిన లంపీ స్కిన్ వ్యాధి నివారణకు అవసరమైన చర్యలు లేవు. దాంతో 2022లోనే కనీసం మూడు లక్షల ఆవులు మరణించటం లేదా ఈ రోగం కారణంగా వట్టిపోయినట్లు అంచనా. ఈ కారణంగా పాల ఉత్పత్తి తగ్గటంతో పాటు రైతాంగానికి ఆర్థికంగా విపరీత నష్టం వాటిల్లింది. ఆవు రాజకీయాలు చేసే వారికి ఇదేమీ పట్టలేదు.

ప్రపంచంలో అధికంగా పాల ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో ఇటీవలి సంవత్సరాలలో తొలిసారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అవసరాలు-ఉత్పత్తికి జత కుదరటం లేదు. ఉత్పత్తి పెరుగుదల దిగజారింది. జాతీయపాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ సమాచారం మేరకు 2022-23లో మన దేశం 477 కోట్ల డాలర్ల విలువ గల పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. ఇది వెయ్యి శాతం ఎక్కువ. ప్రపంచంలో పెరిగిన నెయ్యి గిరాకీ కారణంగా మన దేశం గతేడాది ఏప్రిల్-డిసెంబరు కాలంలో 47 కోట్ల డాలర్ల విలువగల ఎగుమతులు చేసింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే గొప్పలు చెప్పుకొనేందుకు 19.45శాతం ఎక్కువే, కానీ భారీగా పెరిగిన దిగుమతుల మాటేమిటి? దేశంలో నిల్వల పరిస్థితిని బట్టి పాలపొడి, వెన్న, నెయ్యితో సహా ఇతర పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకొనేందుకు దిగుమతి పన్నులను సులభతరం చేసేందుకు కేంద్రం రంగంలోకి దిగవచ్చని కేంద్ర పశుసంవర్థకశాఖ అధికారి రాజేష్ కుమార్ ఏప్రిల్ 5న చెప్పారు. మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అంతకు ముందు ఏడాదితో పోలిస్తే పాల ఉత్పత్తి ఒక్క శాతమే పెరిగింది. గత దశాబ్దికాలంలో వార్షిక సగటు 5.6శాతం ఉంది. ఈ ఏడాది పాల ఉత్పత్తుల డిమాండ్ ఏడుశాతం పెరగవచ్చని అంచనా. గోధుమ గడ్డి, ఇతర మేత లభ్యత తగ్గిన కారణంగా వాటి టోకు ధరలు ఏడాది కాలంలో 25శాతం పెరిగింది. మార్కెట్లో ఆవులు తగ్గిన కారణంగా గేదెల ధరలు బాగా పెరిగాయి.

-ఎం.కె.ఆర్

అంబేద్కర్ బాటన గుజరాత్‌లో బౌద్ధం!

డాక్టర్ దేవరాజు మహారాజు

బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పుట్టిన రోజు సందర్భంగా 2023, ఏప్రిల్ 14న హైదరాబాదు- హుస్సేన్ సాగర్ సమీపంలో 125 అడుగుల ఎత్తయిన అతి పెద్ద కంచు అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించారు. ఆయనపై దేశ ప్రజల ప్రేమాభిమానాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆ రకంగా భారత రాజ్యాంగ నిర్మాతకు దక్కాల్సిన గౌరవం దక్కుతోంది. 'లైట్ ఆఫ్ ఆసియా'గా ప్రపంచప్రఖ్యాతి గాంచిన గౌతమ బుద్ధుణ్ణి, ఆయన బోధించిన ధర్మాన్ని ప్రచారం చేసిన ఆశోకచక్రవర్తిని ఈ ఆధునిక కాలంలో కూడా ప్రజలు స్మరించుకుంటున్నారు. అంతేకాదు, హిందూ మతాన్ని త్యజించి ఆరులక్షల మందితో అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడం కూడా సమకాలికులకు స్ఫూర్తి నందిస్తోంది. తెలంగాణ టూరిజంశాఖ నాగార్జునసాగర్‌లో బుద్ధవనాన్ని ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ స్థాయిలో దాన్ని నిలబెట్టడానికి ఇంకా కృషి చేస్తోంది. ఇక భారతదేశం బైటజరిగే విషయాలు చెప్పుకోవాలంటే ఉత్తర అమెరికాలో అంబేద్కర్ జయంతిని...'డా. బి.ఆర్ అంబేద్కర్ సమానత్వపు రోజు"గా గుర్తించి జరుపుకున్నారు. అంతేకాదు, నెలపొడవునా 'దళిత్ర చరిత్ర మాసం'గా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విషయాలు ఇలా ఉంటే, అదే రోజు 2023 ఏప్రిల్ 14న, గుజరాత్‌లో మరో మహాద్భుతం జరిగింది.. గుజరాత్ రాష్ట్ర రాజధాన్ని గాంధీ నగర్‌లో యాభైవేలమంది దళితులు బౌద్ధం స్వీకరించారు. ఆరాష్ట్రంలోని వివిధ గ్రామాల్లోంచి, పట్టణాల్లోంచి, నగరాల్లోంచి, అటవీ ప్రాంతాల్లోంచి దళితులూ,ఆదివాసీలు అక్కడి రమాకాంతా మైదానంలో సమావేశమయ్యారు. హిందూ మతాన్ని త్యజించి, బాబాసాహెబ్ అంబేద్కర్ నడిచిన దారిలో నడిచి, బౌద్ధం స్వీకరించారు.ఆ రాష్ట్రంలోని దళితులు, ఆదివాసీలు, వెనకబడిన జాతుల వారు అందరూ కలిసి పెద్దఎత్తున ఓ కార్యక్రమం నిర్వహించుకున్నారు. దంగాపూర్ ఆదివాసీలైతే కుటుంబాలకు కుటుంబాలు తరలివచ్చి, బుద్ధ దీక్ష తీసుకున్నారు. కార్యక్రమం చూడడానికి మరికొన్ని లక్షల మంది అక్కడికి చేరుకున్నారు.

ఆ కార్యక్రమాన్ని స్వయం సైనిక్‌దళ్ (ఎస్ఎస్‌డీ) అనే స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించింది. అప్పుడు ఆ ఏప్రిల్ 14న జరిగిన ఆ కార్యక్రమం బౌద్ధ బిక్షు ప్రజ్ఞారత్న ఆధ్వర్యంలో జరిగింది. వీరు పోరుబందర్‌లోని గ్రేట్ అశోకా బౌద్ధ విహార్ నుండి వచ్చి, ఆ కార్యమానికి అధ్యక్షత వహించారు. అక్కడి వారందరితో బుద్ధ దీక్ష ఇప్పించారు. కార్యక్రమాలు ఆ విధంగానే కొనసాగితే రానున్న రెండేళ్లలో అంటే 2025నాటికి ఒక కోటి మంది దీక్ష తీసుకుంటారని దీని వెనక కృషి చేస్తున్న స్వయంసైనిక్ దళ్ ఆశిస్తోంది. ప్రభుత్వం మతాలమధ్య విద్వేషాలు రగిలించడం మాత్రమే కాదు, హిందూ మతస్థుల మధ్య కూడా కలహాలు సృష్టిస్తోంది. బలవంతంగా హిందుత్వను ప్రజలమీద రుద్దడం వల్ల ఫలితాలు వ్యతిరేకంగా వస్తున్నాయి. హిందూ మతంలోని ఎగుడుదిగుళ్లను, నిచ్చెన మెట్లు కుల సంస్కృతిని బలపరచ్చడం, మహిళల హక్కులు, మానవహక్కులు హరించడం ఈ దేశ ప్రజలు భరించలేక పోతున్నారు. మను ధర్మశాస్త్రాన్ని మనప్రాచీన రాజ్యాంగం అంటూ నెత్తికెత్తికోవడం, దేశద్రోహులైన గాడ్సే, సావర్కర్‌ల స్థాయి అనూహ్యంగా పెంచడం - ఈ



దేశప్రజలకు నచ్చడం లేదు. నీతిలేని, చదువులేని ప్రబుద్ధులంతా మహానాయకులై వెలిగిపోవడం-అధర్మమే ధర్మంగా చలామణి అవుతూ ఉండడం ఈ దేశప్రజలకు కష్టంగా ఉంది. అందుకే వేలసంఖ్యలో జనం బుద్ధ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీన్ని హిందూ దేశంగా మార్చాలని కలలుకంటున్న నేటి పాలకులకు, లక్షల మంది హిందూ మతాన్ని త్యజించడం ఒక చెంపపెట్టు!

అధికారంలో ఉన్నవారు ఉగ్రమార్గాన్ని వెతుక్కుంటూ ఉంటే దానికి ధీటైన సమాధానం చెప్పగల సమతామార్గాన్ని, నైతిక రుజుమార్గాన్ని సామాన్యప్రజలు వెతుక్కుంటున్నారు. దేవుడనే రాముడి బూచీ చూపించి పాలకులు రాజకీయాలు చేస్తుంటే అసలు దేవుడనే వాడే లేడన్న బుద్ధ మార్గాన్ని ప్రజలు ఇష్టపడుతున్నారు. శోభాయాత్రల పేరుతో పాలకులు అల్లర్లు, కల్లోలాలు ప్రోత్సహిస్తుంటే..మనసు ప్రశాంతంగా ఉంచుకుని, సర్వజనాభ్యుదయాన్ని కాంక్షించే బుద్ధమార్గాన్ని జనం కోరుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ముఖ్య నాయకులంతా ఆ రాష్ట్రం వారే. బ్యాంకులు దోపిడీచేసి పారిపోయిన దొంగలంతా అక్కడివారే. అలాంటి గుజరాత్‌లో సామాన్యుల ఆలోచనలు ఎలా ఉన్నాయో ఈ కార్యక్రమం తేటతెల్లం చేసింది. అబద్ధాలతో అధికారంలో ఉందామనుకున్న వారికి బదులుగా అబద్ధం ఆడరాదనీ, దొంగతనాలు చేయకూడదని చెప్పిన బుద్ధమార్గాన్ని గుజరాత్ ప్రజలు కావాలనుకుంటున్నారు. ఇది ఎంతో అహ్వానించదగిన పరిణామం. మనం బతుకుదాం. మరొకరిని బతకనిద్దాం. మొత్తానికి మొత్తంగా మనిషిని బతికించుకుందాం అనే సూత్రానికి కట్టుబడ్డ సామాన్యుల చైతన్యం చాలా గొప్పది. వెలుగులవెంట నీడలుండడం కాదు, నీడల్ని మాయం చేయగల వెలుగులు అక్కడ దేదీప్యంగా ప్రసరిస్తున్నాయి.

హిందూమతంలోని పూజలు, భజనలు,పాపాలు, పుణ్యాలు,ఆత్మలు, పునర్జన్మలు, ఆచారాలు, సంప్రదాయాలు వీటన్నిటికంటే ముఖ్యంగా ఉన్నతులు, నిమ్నవర్గాలు వంటివన్నీ మూఢనమ్మకాల పుట్టలు! వీటిలో వేటికీ ఆధారాలులేవు. నిరూపణలు లేవు. కేవలం విశ్వాసాల ఆధారంగా శతాబ్దాలుగా కొనసాగుతూ మానవుల జీవితాలు దుర్భరం చేస్తున్నాయి. అందుకే, వాటన్నిటినీ వదిలి స్వేచ్ఛాలోచనలకు, మానవవాదానికి విశ్వమానవ సౌభ్రాతృత్వానికి విలువనివ్వాలని స్వయంసైనిక్‌దళ్ ప్రచారం చేస్తుంది. మనుషుల్ని ఎగుడుదిగుడు స్థాయిల్లో ఉంచి, వివక్షచూపుతున్న హిందూధర్మాన్ని తిరస్కరించడమే ఈ కార్యక్రమాలు ముఖ్య ఉద్దేశం. ఆనాడు అంబేద్కర్ చేసిందే ఆదర్శంగా తీసుకుని, ఈ రోజు దేశంలో లక్షలమంది బౌద్ధం స్వీకరిస్తున్నారు. మనుషులందరిదీ ఒకేస్థాయి అని నినదిస్తున్నారు. ఎవరి జ్ఞానాన్ని వారు, ఎవరి వివేకాన్ని వారు తట్టిలేపుకోవాలని, నిర్ణయం తీసుకునేముందు బాగా ఆలోచించాలని, బుద్ధిని ఉపయోగించాలని స్వయంసైనిక్‌దళ్ జనానికి బోధిస్తోంది. దీక్ష తీసుకునే విషయంలో ఎవరూ ఎవరినీ బలవంతం చేయడం లేదు. ఎన్నికల్లో మాదిరిగా ఎవరూ ఎవరినీ డబ్బుతో లొంగదీసుకోవడం లేదు. స్వచ్ఛందంగా ఇలాంటి పని ఆలోచనాపరులేచేస్తారు. అదీగాక, ఇది పూజలో, మంత్రాలు వల్లెవేసి మతమార్పిడి చేసే తంతుకాదు. అసలు బౌద్ధం మతమేకాదు.! అదొక జీవన విధానం!! బుద్ధుడి బోధనలు పూర్తిగా స్వీకరించి, అందుకు అనుగుణంగా తమ జీవన విధానం మార్చుకుంటారు. అంతే-ఇది న్యాయసమ్మతంగా, చట్టబద్ధంగా మనస్ఫూర్తిగా చేయవలసిన పని! దీక్ష తీసుకునేవారు వారివారి కలెక్టర్ ఆఫీసుల్లో అప్లికేషన్‌లు నింపాలి. ఆ తర్వాత అందులో ప్రకటించినవన్నీ నిజాలాకాదా-అనేది పోలీసు ఎంక్వయిరీ జరుగుతుంది. దీక్ష తీసుకున్నవారి వివరాలన్నీ గజిట్‌లో అచ్చేస్తారు. ఇదంతా అధికారికంగా జరిగే కార్యక్రమం.

ఈ స్వయం సేవక్‌దళ్ తొలుత 2006లో ఒక యాభై మందితో ఏర్పడింది. ఒకే ఆలోచనావిధానం గల మిత్రులైన దళిత కార్యకర్తలతో మొదలైంది. ఆ సంఖ్య... క్రమంగా ఊహించనిరీతిలో పెరుగుతూ పోయింది. ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి రోజున ఇలాంటి దీక్షలు ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగుళూర్, భోపాల్, ముంబై, హైదరాబాదు, లక్నో వంటి పెద్దపెద్ద నగరాల్లో జరపాలని స్వయం సైనిక్ దళ్ పథకాలు వేసుకుంది.

-కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

నిరంకుశ ప్రభుత్వ ఏజెన్సీ పాలన

కేంద్రంపై మమత విమర్శ

కోల్‌కతా: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహావం వ్యక్తంచేశారు. పని చేసేందుకు కేంద్ర యంత్రాంగం అనుమతించడం లేదని ఆరోపించారు. పాఠశాల నియామక కుంభకోణం విచారణ కోసం కోల్‌కతా సీబీఐ కార్యాలయానికి తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ హాజరయ్యారు. ఈ క్రమంలోనే మమతా ఈ ఆరోపణలు చేశారు. కేంద్రంలోని నిరంకుశ ప్రభుత్వ ఏజెన్సీ పాలన మా పనిని సవాల్‌గా మార్చిందని ట్వీట్ చేశారు. 34 ఏళ్ల రాక్షస పాలనను మార్చి పశ్చిమ బెంగాల్‌లో 'మా, మతి, మనుష్' (తల్లి, భూమి, ప్రజలు) ప్రభుత్వాన్ని ప్రారంభిస్తామని 2011లో ఈ రోజున ప్రమాణం చేశామని మమతా బెనర్జీ మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ రోజు మనం చేసిన ప్రతిజ్ఞను పునరుద్ఘాటిస్తున్నామని, ప్రజల కోసం మనల్ని మనం పునరంకితం చేసుకుంటున్నామన్నారు.

సుందర్ పిచాయ్ చిన్ననాటి ఇల్లు అమ్మకం

చెన్నై: గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చిన్నతనంలో నివసించిన ఇంటి స్థలాన్ని ఆయన తండ్రి విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారని ఆ ఆస్తిని కొనుగోలు చేసిన తమిళ సినీ నటుడు, నిర్మాత సి.మణికందన్ తెలిపారు. చెన్నైలోని అశోక్ నగర్‌లో సుందర్ పిచాయ్ నివసించిన ఇల్లు అమ్మకానికి ఉందని తెలిసిన వెనువెంటనే దాని కొనుగోలుకు మణికందన్ ముందుకు వచ్చినట్లు ఒకవార్తాసంస్థ తెలిపింది. ఆ ఇంటిని కూల్చివేసి, స్థలానికి సంబంధించిన ఆస్తి పత్రాలు అందజేసే సమయంలో సుందర్ తండ్రి రఘునాథ పిచాయ్ భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారని మణికందన్ తెలిపారు. 'సుందర్ పిచాయ్ మన దేశాన్ని గర్వపడేలా చేశారు. ఆయన నివసించిన ఇంటి స్థలాన్ని కొనుగోలు చేయడం నా జీవితంలో గర్వించదగ్గ విషయం' అని మణికందన్ తెలిపారు. స్థిరాస్తి కొనుగోలు లావాదేవీలు సాగుతున్న సమయంలో సుందర్ తల్లిదండ్రుల మర్యాద తనను కదిలించిందన్నారు. 'సుందర్ తల్లి స్వయంగా ఫిల్టర్ కాఫీ చేసి ఇచ్చారు. ఆయన తండ్రి మొదటి సమావేశంలోనే నాకు సంబంధిత పత్రాలు అందించారు. వారి వినయపూర్వక వ్యవహార శైలిని చూసి ఆశ్చర్యపోయా' అని చెప్పారు. 'సుందర్ తండ్రి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గంటల తరబడి వేచి ఉన్నారు. నాకు పత్రాలు ఇవ్వడానికి ముందు అవసరమైన అన్ని పన్నులు చెల్లించారు. ఇంటిని కూల్చేందుకు అయిన ఖర్చునూ భరించారు. ఇది ఆయన మొదటి ఆస్తి కాబట్టి పత్రాలను అందజేసేటప్పుడు భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు' అని మణికందన్ తెలిపారు.

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో టైట్లర్‌పై సీబీఐ చార్జీషీట్

న్యూఢిల్లీ: సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత జగదీశ్ టైట్లర్‌కు ఇప్పట్లో ఉపశమనం లభించేలా లేదు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ ఆయనపై శనివారం చార్జిషీట్ దాఖలు చేసింది. 1984 అక్టోబర్ 31న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సిక్కు మతానికి చెందిన తన అంగరక్షకుల చేతిలోనే దారుణహత్యకు గురికావడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహంతో ఊగిపోయాయి. అనేక చోట్ల సిక్కులను ఊచకోత కోశాయి. ఇందిరాగాంధీ హత్య జరిగిన మరుసటి రోజే పంజాబ్‌లోని పుల్ బంగాశ్ ఏరియాలోని గురుద్వారాకు అల్లరి మూకలు నిప్పుపెట్టాయి. ఈ ఘటనలో ముగ్గురు సిక్కు పౌరులు మృతిచెందారు. అయితే, జగదీశ్ టైట్లరే అల్లరిమూకలను రెచ్చగొట్టి గురుద్వారాకు నిప్పుపెట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ టైట్లర్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాలు లేవంటూ క్లీన్ చిట్ ఇచ్చింది. కానీ, 2015లో సాక్ష్యాధారాలు లభించాయంటూ ఆయనపై కేసును తిరగదోడింది. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో టైట్లర్ స్వర నమూనాను సీబీఐ తీసుకుంది. స్వర నమూనా ఇచ్చేందుకు ఫోరెన్సిక్ ల్యాబోరేటరీకి వెళ్లిన సందర్భంగా టైట్లర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో తప్పుచేసినట్లు తేలితే ఉరికంబం ఎక్కేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన వ్యాఖ్యానించారు. సీబీఐ మాత్రం టైట్లర్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాలు లభించాయని చెబుతోంది.

'సేవల'పై తీర్పును సమీక్షించాలి

సుప్రీంకోర్టులో కేంద్రం రివ్యూపిటిషన్

న్యూఢిల్లీ: దిల్లీలో ప్రభుత్వాధికారాలపై కేంద్రం, ఆప్ ప్రభుత్వానికి మధ్య వివాదం సద్దుమణగలేదు. ఈనెల 11వ తేదీన ఇచ్చిన తీర్పుపై సమీక్షను కోరుతూ సర్వోన్నత న్యాయస్థానాన్ని కేంద్రప్రభుత్వం ఆశ్రయించింది. ఐఏఎస్‌లు సహా ప్రభుత్వాధికారుల బదిలీలు, నియామకాలపై స్థానిక ప్రభుత్వానికే నియంత్రణ ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దాంతో ఆప్ ప్రభుత్వం సేవల విభాగం కార్యదర్శి ఆశిష్ మోరెను బదిలీ చేసింది. ఈ ప్రక్రియను కేంద్రం అడ్డుకుంది. అధికారుల బదిలీలు, నియామకాల విషయంలో లెఫ్టినెంట్ గవర్నర్‌ను మధ్యవర్తిగా చేస్తూ శుక్రవారం ఆర్డినెన్స్ జారీచేసింది. ఇదే అంశంలో సుప్రీంకోర్టు తీర్పుపై సమీక్ష కోరుతూ రివ్యూ పిటిషన్‌ను కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దాఖలు చేశారు. ఆర్డినెన్స్ ప్రకారం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీసెస్ అథారిటీ ఏర్పాటైంది. ఇది బదిలీలు, నియామకాలపై నిర్ణయం తీసుకుంటుంది. ముఖ్యమంత్రి (ఛైర్‌పర్సన్) కాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ప్రధాన కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఓటింగ్ ద్వారా నిర్ణయం తీసుకుంటారు. అలా కుదరని పక్షంలో తుది నిర్ణయం తీసుకునే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉంటుంది.

సామూహిక వివాహాల ఆర్థిక సాయం రూ.25 వేలు

మహారాష్ట్ర సీఎం షిండే

పాల్ఘర్ : సామూహిక వివాహాలు చేసుకునే జంటలకు అందించే ఆర్థిక సహాయాన్ని రూ.10 వేల నుంచి రూ.25 వేలకు పెంచుతున్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శనివారం తెలిపారు. కనీసం 325 జంటలు ముడి పడిన పాల్ఘర్ జిల్లాలో జరిగిన సామూహిక వివాహ కార్యక్రమంలో షిండే మాట్లాడుతూ పెద్దపెద్ద పెళ్లిళ్లు చేసుకునే అవకాశం లేని కారణంగా సామూహిక వివాహాలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గానికి ఉపయోగపడేలా ఈ ప్రాంతంలో 150 పడకల ఇఎస్ఐఎస్ ఆస్పత్రి రాబోతోందని అన్నారు. తమ ప్రభుత్వ విధానాలు పరిశ్రమలకు, వాటి అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని అన్నారు. పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని, స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని జిల్లాలోని పరిశ్రమలను ఆదేశించినట్లు తెలిపారు.

ఇచ్చిన మాట తప్పం...

మంత్రిమండలి తొలి భేటీ

ఐదు హామీల అమలుకు సూత్రప్రాయ ఆమోదం

కర్నాటక సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: కర్నాటకలో కాంగ్రెస్ మంత్రిమండలి కొలువుదీరింది. నూతన మంత్రిమండలి శనివారం తొలిసారి సమావేశమైంది. ఎన్నికలప్పుడు ఇచ్చిన ఐదు ప్రధాన హామీల అమలునకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఇందుకోసం రాష్ట్ర ఖజానాపై రూ.50వేల కోట్ల వార్షికభారం అంచనా ఉంది. కొత్త ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రుల ప్రమాణ స్వీకారం తర్వాత మంత్రిమండలి భేటీ అయింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిద్ధరామయ్య మాట్లాడుతూ ఆర్థిక భారం ఎంతైనాగానీ భరిస్తాం. ఇచ్చిన ఐదు హామీలను తప్పక అమలు చేస్తాం' అని స్పష్టంచేశారు. కేబినెట్ రెండో భేటీ తర్వాత అన్ని హామీలు అమలవుతాయని చెప్పారు. కర్నాటక బడ్జెట్ రూ.3.1లక్షల కోట్లు అని, ఐదు హామీల అమలు కోసం రూ.50వేల కోట్లను సంవత్సరానికి ఖర్చు పెట్టడం పెద్ద సమస్య కాబోదని సీఎం అన్నారు. రాష్ట్రాన్ని రుణరాష్ట్రంగా మార్చకుండా, ఆర్థిక కష్టాల్లోకి నెట్టకుండా సంక్షేమ పథకాలను అమలు చేయగలమన్న విశ్వాసం ఉన్నదన్నారు. 'మన రుణంపై ఏటా రూ.56వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నప్పుడు మన ప్రజల సంక్షేమం కోసం రూ.50వేల కోట్లు వెచ్చించలేమా? అని ప్రశ్నించారు. 'హామీల అమలుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపాం. తదుపరి జరిగే కేబినెట్ సమావేశంలో అన్ని వివరాలు వెల్లడిస్తా. ఇప్పటికే అందుకు ఉత్తర్వుల జారీకి ఆదేశాలిచ్చాను. అన్ని వివరాలు, ఆర్థిక అంశాలు అన్నింటిపై స్పష్టత లభిస్తుంది' అని సిద్ధరామయ్య చెప్పారు. ఈ అంశాలన్నింటినీ ముందే ఎందుకని పరిశీలించలేదని విలేకరి ప్రశ్నించగా ఏదిఏమైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాం. ఐదు హామీలను తప్పక అమలు చేస్తాం' అని నూతన ముఖ్యమంత్రి బదులిచ్చారు. కాగా, అన్ని గృహాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ (గృహ జ్యోతి), ప్రతి కుటుంబంలోని మహిళకు నెలకు రూ.2 వేలు (గృహలక్ష్మి), ప్రతి సభ్యునికి 10 కిలోల బియ్యం (అన్న భాగ్య), నిరుద్యోగ గ్రాడ్యుయేట్ యువతకు నెలసరి రూ.3వేలు, నిరుద్యోగ డిప్లొమాహోల్డర్‌లకు (ఇద్దరూ 18-25 ఏళ్ల మధ్య వయస్సు గలవారు) రెండేళ్లపాటు (యువనిధి) రూ.1,500, ప్రజా రవాణా బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం(శక్తి) పథకాలను అధికారం చేపట్టిన తొలిరోజే అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిన విషయం విదితమే.

బీడీ పరిశ్రమపై మరిన్ని పన్నులు విధించాలి

- పొగాకు వాడకం తగ్గింపునకు... మరణాల నివారణకు అవసరం
- తాజా అధ్యయనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ : పొగాకు వినియోగాన్ని తగ్గించడానికి, సంబంధిత మరణాలను నివారించడానికి ఇతర పొగాకు ఉత్పత్తులకు అనుగుణంగా బీడీ పరిశ్రమకు వ్యతిరేకంగా మెరుగైన పన్ను, పటిష్ట నియంత్రణ చర్యలు చేపట్టాలని ఇటీవలి అధ్యయనం సిఫార్సు చేసింది. జోధ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఏఎంఎస్) స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఈ అధ్యయనాన్ని ఇంటర్నేషనల్ యూనియన్ అగైనెస్ట్ ట్యూబర్క్యులోసిస్ అండ్ లంగ్ డిసీజ్ సహకారంతో నిర్వహించింది. అధ్యయన నివేదికను శుక్రవారం విడుదల చేసింది. బీడీ వినియోగం వల్ల వినియోగదారులకు ఆరోగ్య, పర్యావరణ, ఆర్థిక భారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, బీడీ పరిశ్రమకు 'కుటీర పరిశ్రమ' హోదాను తొలగించాలని సిఫారసు చేసింది. ఇది మూడు వేర్వేరు అంచనాలను అందించింది. మొదట ఉత్పత్తి నిబంధనలను పెంచడం, రెండవది పన్నులను పెంచడం, మూడవది రెండూ ఏకకాలంలో చేయడం ద్వారా. బీడీ పన్నును సిగరెట్‌తో సమానంగా పెంచినట్లయితే, ప్రభుత్వ ఖజానాకు 10 రెట్లు ఎక్కువ ఆదాయం సమకూరుతుందని, దాదాపు 50 లక్షల జీవిత సంవత్సరాలు ఆదా అవుతుందని ఎయిమ్స్ జోధ్‌పూర్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెడ్ అకడమిక్ హెడ్ డాక్టర్ పంకజ్ భరద్వాజ్ అన్నారు. 'ప్రస్తుతం దాదాపు 20.6 శాతం బీడీ పరిశ్రమ నియంత్రణలో ఉంది. బీడీపై పన్ను 22 శాతం తక్కువగా ఉంది. సిగరెట్‌లపై 52 శాతం, పొగలేని పొగాకుపై 64 శాతం ఉండగా, డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు 75 శాతంగా ఉంది' అని డాక్టర్ భరద్వాజ్ చెప్పారు. బ్లాక్ మార్కెటింగ్, చట్టవిరుద్ధమైన చలామణిని తగ్గించేందుకు, దీర్ఘకాలంలో 100 శాతం నియంత్రణ సాధించేందుకు వీలుగా పొగాకు విక్రేతల లైసెన్సింగ్ నిబంధనలను అమలు చేయడంపై అధ్యయనం ఉద్ఘాటించింది. ఆగ్నేయాసియాలోని క్షయ, ఊపిరితిత్తుల వ్యాధికి వ్యతిరేకంగా ఇంటర్నేషనల్ యూనియన్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కుల్దీప్ సింగ్ సచ్‌దేవా మాట్లాడుతూ బీడీ ధూమపానం దాని వినియోగదారు ఆరోగ్యంపై ఒకే విధమైన హానికరమైన ప్రభావాలను కలిగిస్తుందని, అయితే పరిశ్రమ అనేక నిబంధనలను తప్పించుకుంటుందని, చాలా తక్కువ పన్ను పరిధిలో ఉందని తెలిపారు. నివేదికను ఆవిష్కరించిన సందర్భంగా, కేంద్ర ఆరోగ్య కార్యదర్శి రాజేశ్ భూషణ్ మాట్లాడుతూ నియంత్రిత పరిశ్రమలా కాకుండా, బీడీ పరిశ్రమ తులనాత్మకంగా చెల్లాచెదురుగా ఉందని, ఎందుకంటే ఎండుటాకులను సేకరించే వ్యక్తులు బీడీని చుట్టవచ్చు లేదా చుట్టకపోవచ్చని అన్నారు. 'ఈ ఎండు ఆకులు సేకరించే వారు చేసే ప్రత్యామ్నాయ వృత్తులు ఏమిటి, ఆర్థికంగా సమానమైన లేదా ఎక్కువ ఆదాయం వచ్చే వృత్తులు ఏమిటో కూడా మనం ఆలోచించాలి' అని తెలిపారు. భారత్‌లో బీడీ వినియోగం వల్ల జీవితకాలం, ఆరోగ్యం, ఆర్థిక భారంపై 2వ జాతీయ సంప్రదింపుల సమావేశం సందర్భంగా భూషణ్ ఇక్కడ ప్రసంగించారు. అదే కార్యక్రమంలో విడుదలైన 'లైఫ్ సైకిల్ అప్రోచ్ టు బీడీ ట్రేడ్ ఇన్ ఇండియా' అనే మరో నివేదిక... అధిక, స్థిరమైన నికోటిన్ బహిర్గతం కారణంగా బీడీ చుట్టడాన్ని వృత్తిపరమైన ఆరోగ్య ప్రమాదంగా గుర్తించాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ సిఫార్సు చేసింది.

రూ.2 వేల నోటు ఉపసంహరణతో లాభమే

ఆర్థికశాఖ మాజీ సలహాదారు కృష్ణమూర్తి

న్యూఢిల్లీ: రూ.2వేల నోట్ల ఉపసంహరణ దేశ ఆర్థిక వ్యవస్థకు లాభదాయకంగావుంటుందని ఆర్థికశాఖ మాజీ సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ ఆశాభావం వ్యక్తంచేశారు. రూ.2వేల నోటు ఉపసంహరణతో నగదు నిల్వ ఉంచుకోవడం తగ్గుతుందన్నారు రూ.3.6లక్షల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు చలామణిలో ఉన్నాయనీ, ఇందులో కొంతభాగం ఎక్కడుందో కూడా తెలియదన్నారు. నోట్ల ఉపసంహరణ నిర్ణయంతో ఆ నోట్లన్నీ బయటకు వస్తాయన్నారు. దర్యాప్తు సంస్థల దాడుల్లో ఇటీవల కాలంలో అధికంగా నోట్ల గుట్టలు బయటపడుతుండగా అందులో రూ.2వేల నోట్లే అధికంగా ఉన్నాయని చెప్పారు. దేశంలో 80శాతం మంది ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2వేల నోట్లను చట్టబద్ధంగా భద్రపర్చుకున్నారు. కానీ ఆ నోట్ల విలువ మొత్తం చలామణీలో ఉన్న రూ.2వేల నోట్ల విలువలో కేవలం 20శాతం మాత్రమేననీ, మిగతా 20శాతం మంది వద్ద ఉన్న రూ.2వేల నోట్ల విలువ 80శాతంగా ఉంది. ఆ మొత్తం వెలికి తీసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని కృష్ణమూర్తి సుబ్రమణియన్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ నోటు ఉపసంహరణతో సామాన్యులకు ఎలాంటి అసౌకర్యం ఉండదని చెప్పారు. ప్రస్తుతం రూ.2వేల నోటును చెల్లింపుల కోసం ఎక్కువగా వినియోగించట్లేదు. చలామణీలో ఉన్న మొత్తం కరెన్సీ నోట్లలో ఈ నోట్ల విలువ కేవలం 10.8శాతమే. ఇప్పుడు అత్యధిక లావాదేవీలు డిజిటల్ చెల్లింపుల రూపంలోనే జరుగుతున్నాయి. అందువల్ల, కరెన్సీ నోట్లు ముఖ్యంగా రూ.2వేల నోటు వినియోగం క్రమక్రమంగా మరింత తగ్గిపోతుందన్నారు. రూ.2వేల నోటుకు ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేందుకు మరో పెద్ద నోటు రూ.500 నోటు ఉంది. నగదు మార్పిడి కోసం ఈ నోట్లను వాడుకోవచ్చు. 2026 నాటికి డిజిటల్ లావాదేవీలు మూడు రెట్లు పెరుగుతాయని నివేదికలు చెబుతున్నాయి. అందువల్ల రాబోయే ఏళ్లలో రూ.2వేల నోటు వినియోగం అవసరం ఉండకపోవచ్చునన్నారు. రూ.2వేల నోటు చెల్లుబాటు (లీగల్ టెండర్) కొనసాగుతుందని ఆర్‌బీఐ చెప్పింది. సెప్టెంబరు 30 తర్వాత కూడా ఇది చెల్లుబాటు అవుతుందా లేదా అనే దానిపై ఆర్‌బీఐ మళ్లీ స్పష్టతనిస్తుంది. అప్పటివరకు చట్టపరంగా భద్రపర్చుకున్న వారు తమ రూ.2వేల నోట్లను మార్చుకునేందుకు ఏ సమస్యా ఉండదు. ఎలా చూసినా ఈ నిర్ణయం సరైందే అని కృష్ణమూర్తి సుబ్రమణియన్ తన ట్విటర్ ఖాతాలో వివరించారు.

సుప్రీం తీర్పును ప్రజలకు వివరిస్తాం

మహా రాజకీయ సంక్షోభంపై ఎంవీఏ భాగస్వామ్య పక్షాలు

థానే : మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే-దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం 'రాజ్యాంగ విరుద్ధం' అని మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) మిత్రపక్షాలు శనివారం అభివర్ణించాయి. గత ఏడాది ఉద్ధవ్ థాకరే ప్రభుత్వ పతనానికి దారితీసిన రాజకీయ సంక్షోభంపై సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై రాష్ట్రాన్ని పాలిస్తున్న వారు ప్రజల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించాయి. థానేలో సంయుక్త విలేకరుల సమావేశంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నగర విభాగం అధ్యక్షుడు ఆనంద్ పరాంజపే, శివసేన (యూబీటీ), కాంగ్రెస్ నాయకులు ప్రదీప్ షిండే, విక్రాంత్ చవాన్ మాట్లాడుతూ మూడు మిత్రపక్షాలు ప్రజలకు చేరువవుతాయని, అత్యున్నత న్యాయస్థానం తీర్పు అర్థాన్ని వారికి వివరిస్తామని చెప్పారు. ఎంవీఏ ప్రభుత్వ పతనానికి దారితీసిన రాజకీయ సంక్షోభానికి సంబంధించిన పిటిషన్లపై మే 11 న ఇచ్చిన తీర్పులో గత ఏడాది జూన్‌లో ఉద్ధవ్ బలపరీక్ష ఎదుర్కోకుండానే రాజీనామా చేసినందున, మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే కొనసాగుతున్నందున ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని అప్పటి ఎంవీఏ ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ విషయంలో రాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ తీరును కూడా కోర్టు నిలదీసింది. ఎన్‌సీపీ నేత పరంజపే మాట్లాడుతూ 'ఏక్‌నాథ్ షిండే, బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం తీర్పును తప్పుగా అర్థం చేసుకుని రాష్ట్ర ప్రజలను గందరగోళానికి గురిచేస్తోంది. అయితే సుప్రీం కోర్టు తీర్పును వివరించడం ద్వారా విషయాలను సరైన కోణంలో ఉంచాలనుకుంటున్నాము. అందువల్ల, గవర్నర్ పాత్ర, ఇతర విషయాలను ప్రస్తావిస్తూ తీర్పు కచ్చితమైన అర్థం ఏమిటో ప్రజలకు చేరవేయాలని, వారికి వివరించాలని ఎంవీఏ నిర్ణయించింది. దీనిపై సమావేశాలు నిర్వహిస్తాం. ప్రారంభించడానికి, మూడు పార్టీల ఆఫీస్ బేరర్ల కోసం వచ్చే మంగళవారం థానేలో ఒక సమావేశం నిర్వహిస్తాము' అని చెప్పారు. తరువాత, ప్రతి జిల్లా, తాలూకాలో ఇటువంటి వివరణాత్మక సమావేశాలు జరుగుతాయని షిండే, చవాన్ తెలిపారు. ఎంవీఏ భాగస్వాములకు చెందిన స్థానిక సీనియర్ నాయకులు థానేలో సమావేశంలో ప్రసంగిస్తారని, పాయింట్లవారీగా తీర్పును వివరిస్తారని వారు వివరించారు.

బోరుబావి నుంచి బాలుడు సురక్షితం

జైపూర్ : జైపూర్ జిల్లాలోని జోబ్నర్‌లో శనివారం ఉదయం బోరుబావిలో పడిపోయిన తొమ్మిదేళ్ల బాలుడిని ఏడు గంటల సుదీర్ఘ ప్రయత్నం తర్వాత రక్షించినట్లు అధికారి ఒకరు తెలిపారు. అక్షిత్ అనే బాలుడు ఆడుకుంటూ తెరిచి ఉన్న బోరుబావిలో పడిన ఘటన భోజ్‌పురా గ్రామంలో చోటుచేసుకుంది. బాలుడు బోరుబావిలో 70 అడుగుల లోతులో చిక్కుకున్నాడు. 'బృందం కృషితో బాలుడు రక్షించబడ్డాడు.

అతని పరిస్థితి నిలకడగా ఉంది. జోబ్నర్‌లోని ఆస్పత్రికి తరలించాము' అని ఎస్‌డీఎం అరుణ్ జైన్ తెలిపారు. బోరు బావిలో బాలుడు పడిపోయిన విషయం వ్యాప్తి చెందడంతో పరిపాలనా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), ఎస్‌డీఆర్ఎఫ్, పౌర రక్షణకు చెందిన బృందాలతో కలిసి సహాయక ఆపరేషన్‌ను ప్రారంభించారు. రక్షించిన తర్వాత, వైద్య పరీక్షల కోసం బాలుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

అక్షిత్ తనకు ఆక్సిజన్, నీరు, తినడానికి బిస్కెట్లు సరఫరా చేసిన తన రక్షకులతో మాట్లాడుతూనే ఉన్నాడని అధికారులు తెలిపారు. అంతకుముందు వ్యవసాయ మంత్రి లాల్‌చంద్ కటారియా కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

రూ. 2 కోట్లకు పైగా నగదు, కిలో బంగారం స్వాధీనం

జైపూర్: రాజస్థాన్‌లోని జైపూర్‌లోని యోజన భవన్‌లో ఉన్న ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ కార్యాలయంలో 2 కోట్లకు పైగా నగదు, కిలో బంగారం బయట పడటం తీవ్ర కలకలం రేపింది. యోజన భవన్‌లో బేస్‌మెంట్ అల్మార్‌లో ఉంచిన బ్యాగులో సుమారు రూ. 2.31 కోట్లకు పైగా నగదు, ఒక కిలో బంగారం బిస్కెట్లు పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేయడమే గాక ఈ ఘటనపై దర్యాప్తు చేయడం ప్రారంభించారని పోలీసుల కమిషనర్ ఆనంద్ కుమార్ శ్రీ వాస్తవ తెలిపారు.

పరాజయం ఎరగని నేత

డీకే రాజకీయ ప్రస్థానం



బెంగళూరు: కర్నాటక రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆయనో సంచలనం. పార్టీలో ఎక్కడ సంక్షోభం వచ్చినా పరిష్కరించగల నేర్పరి. నవయువకుడిగా రాజకీయ రంగప్రవేశం చేసి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. పీసీసీ అధ్యక్షునిగా కర్నాటకలో కాంగ్రెస్‌కు ఘనవిజయాన్ని అందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయపథాన నడిపించారు. ఆయనే దొడ్డనహళ్లి కెంపెగౌడ శివకుమార్. 61 ఏళ్ల శివకుమార్ పీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ట్రబుల్ షూటర్‌గా కాంగ్రెస్‌లో పేరు తెచ్చుకున్నారు. 2002లో మహారాష్ట్రలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి విలాసరావు దేశ్‌ముఖ్ ప్రభుత్వాన్ని కాపాడటంలో, 2017లో గుజరాత్‌లో అహ్మద్‌పటేల్ రాజ్యసభకు ఎన్నిక కావడంలో కీలక పాత్ర పోషించారు. తనకున్న చాతుర్యంతో, పార్టీలో ఎంతటి సమస్యనైనా పరిష్కరించగలరనే ప్రశంసలందుకున్నారు. 2018లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక జనతాదళ్, కాంగ్రెస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించారు.

జనతాదళ్ ఎస్ నేత కుమారస్వామి ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా, సిద్ధరామయ్య ప్రభుత్వంలో విద్యుత్ శాఖ మంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు నిర్వహించారు. కనకపుర నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. వక్కలిగ సామాజిక వర్గానికి చెందిన శివకుమార్ 1980లో విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. 1989లో 27 ఏళ్ల వయసులో తొలిసారి మైసూరు జిల్లాలోని సాతనూరు నియోజకవర్గం నుంచి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత మరో మూడు సార్లు అక్కడి నుంచే గెలిచారు. 2008 నుంచి వరుసగా నాలుగుసార్లు కనకపుర నుంచి ఎన్నికవుతూ వస్తున్నారు. పార్టీలో ట్రబుల్ షూటర్‌గా ఎంత పేరు తెచ్చుకున్నారో మంత్రిగా పనిచేసినపుడు అవినీతి ఆరోపణల్ని కూడా అదే స్థాయిలోఎదుర్కొన్నారు. ఆయన మీద ఉన్న అవినీతి ఆరోపణలు, అక్రమ సంపద కేసులతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శివకుమార్‌ను లక్ష్యంగా చేసింది. బీజేపీలో చేరమని చేసిన ఒత్తిడి ఫలించకపోవడంతో సీబీఐ, ఈడీ కేసులతో శివకుమార్‌ని ఉక్కిరి బిక్కిరి చేసింది. జైలులో పెట్టినప్పటికీ చలించకుండా కాంగ్రెస్ పార్టీలో స్థిరంగా కొనసాగారు. బెంగళూరు శివార్లలోని తన ఫామ్ హౌస్ కాంగ్రెస్ పార్టీలోని అనేక రాజకీయ సంక్షోభాలను నివారించింది.

న్యాయవాది నుంచి సీఎం వరకు

సిద్ధరామయ్య రాజకీయ ప్రస్థానం



బెంగళూరు: కర్నాటక కొత్త సీఎంగా శనివారం ప్రమాణస్వీకారం చేసిన 75 ఏళ్ల సిద్ధరామయ్య కర్నాటక 24వ సీఎం. రాజకీయాల్లో 45 ఏళ్ల సుదీర్ఘ అనుభవం అన్న ఆయన గతంలో 2013 నుంచి 2018 వరకు పూర్తికాలం సీఎం పదవిలో కొనసాగారు. కర్నాటకలో ముఖ్యమంత్రిగా అయిదేళ్ల పూర్తికాలం పదవిలో ఉన్న మూడో వ్యక్తి ఆయన. గతంలో దేవరాజ్ అర్స్, ఎస్. నిజలింగప్ప మాత్రమే అయిదేళ్ల పూర్తి కాలం సీఎం పదవిలో ఉన్నారు. 1956 నుంచి తీసుకుంటే.. ఇప్పటి వరకు కేవలం ముగ్గురు వ్యక్తుల మాత్రమే పూర్తికాలం పదవిలో కొనసాగారు. వారంతా కాంగ్రెస్‌కు చెందినవారే కావడం విశేషం.

నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న సిద్ధరామయ్య జీవితంలో అనేక మలుపులు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థిగా ఉన్న ఆయన తరువాత అదే పార్టీలో చేరి ముఖ్యమంత్రి అయ్యారు. స్వాతంత్ర్యం రావడానికి కొన్ని రోజుల ముందు 1947 ఆగస్టు 3న సిద్ధరామే గౌడ బోరమ్మ దంపతులకు సిద్ధరామయ్య మైసూరు జిల్లాలోని సిద్ధరమణహుండి అనే చిన్న గ్రామంలో జన్మించారు. వ్యవసాయం నేపథ్యం గల కుటుంబానికి చెందినవారు. సిద్ధరామయ్య అయిదుగురు తోబుట్టువులలో రెండవవాడు. సిద్ధరామయ్య పదేళ్ల వయస్సు వరకు పాఠశాలకు వెళ్లి ఎలాంటి విద్యను అభ్యసించలేదు. మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, ఎల్ఎల్‌బీ డిగ్రీలతో పట్టభద్రుడయ్యాడు. సిద్ధరామయ్యకు పార్వతితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. రాజకీయ వారసుడిగా భావించిన పెద్ద కుమారుడు రాకేశ్(38) మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో 2016లో మరణించారు. రెండవ కుమారుడు యతీంద్ర మైసూరులోని వరుణ జిల్లా నుంచి 2018లో శాసనసభకు పోటీ చేసి గెలుపొందారు. ఇటీవల జరిగిన ఎన్నికలో పోటీ చేయలేదు. సిద్ధరామయ్య కాలేజీ రోజుల్లోనే వాక్చాతుర్యంతో మంచి వక్తగా పేరుగాంచారు. మైసూరు జిల్లా కోర్టులో చిక్కబోరయ్య అనే న్యాయవాది దగ్గర జూనియర్‌గా పనిచేస్తున్న సమయంలో నంజుడ స్వామి పరిచయమయ్యారు. ఆయనే సిద్దారమయ్యను రాజకీయాల్లోకి రమ్మని, మైసూరు తాలుకా నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలని కోరారు. అందుకు అంగీకరించిన సిద్ధరామయ్య 1983లో భారతీయ లోక్‌దళ్ పార్టీ టికెట్‌పై చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలిసారి కర్నాటక అసెంబ్లీలో అడుగుపెట్టారు. వ్యవసాయం, నిరాడంబర నేపథ్యం నుంచి వచ్చిన సిద్ధరామయ్య తన విజయంతో అందరినీ ఆశ్చర్యపరిచి, పాత మైసూరు ప్రాంతంలో సంచలనంగా మారారు. అనంతరం జనతా పార్టీలో చేరి కన్నడ అధికార భాషగా అమలు చేయడాన్ని పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన కన్నడ నిఘా కమిటీకి మొదటి అధ్యక్షుడిగా పనిచేశారు. తిరిగి 1985లో మరోసారి చాముండేశ్వరీ నుంచి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. ఈసారి ఏకంగా రామకృష్ణ హెగ్డే కేబినెట్‌లో పశు వైద్య సేవల మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టారు.

1992లో జనతాదళ్ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికయ్యారు. తిరిగి 1994లో హెచ్‌డీ దేవెగౌడ నాయకత్వంలో జనతా పార్టీ అధికారంలో వచ్చిన సమయంలో సిద్ధరామయ్య ఆర్థికశాఖ మంత్రిగా పని చేశారు. పార్టీ సెక్రటరీ జనరల్‌గా కూడా పనిచేశారు. 1996లో జేహెచ్ పటేల్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అయినప్పటికీ1999లో మంత్రివర్గం నుంచి తొలగించారు. మొత్తం తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

పాలిసెట్‌లో 86.35 శాతం ఉత్తీర్ణత

- 29 నుంచి వెబ్ కౌన్సెలింగ్, అర్హతా పత్రాల పరిశీలన
- ఫలితాలు విడుదల చేసిన చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య, శిక్షణా మండలి పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శనివారం విజయవాడలో విడుదల చేశారు. మొత్తం 1,60,332 విద్యార్థులకుగాను 1,43,625 మంది (89.58 శాతం) పరీక్షకు హాజరు కాగా అందులో 1,24,021 మంది (86.35 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 88,068 మంది హాజరు కాగా 74,633 మంది (84.74 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే బాలికలు 55,557 మంది హాజరై 49,388 మంది (88.9 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పాలిసెట్ 2023లో 120 మార్కులకు 30 మార్కులను ఉత్తీర్ణతగా నిర్ణయించామని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీస మార్కుల నిబంధన లేదన్నారు. ఫలితంగా పాలిసెట్-2023 పరీక్షకు హాజరైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులందరూ అర్హత సాధించినట్లు అవుతుందన్నారు. ర్యాంకింగ్ విధానం గురించి వివరిస్తూ అభ్యర్థి మొత్తం మార్కుల ఆధారంగా ర్యాంకులు ఇచ్చామని, మార్కులు సమానంగా పొందిన వారికి గణితంలో వచ్చిన మార్కులను బట్టి ర్యాంకులు నిర్ణయించామన్నారు. అప్పటికీ సమానత ఉంటే భౌతిక శాస్త్రంలో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత కూడా మార్కులు సమానంగా ఉంటే ఒకే ర్యాంకు ఇచ్చినట్లు చెప్పారు. పుట్టిన తేది, పదవ తరగతి మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్ సమయంలో కళాశాలు కేటాయిస్తారని కమిషనర్ వెల్లడించారు. ర్యాంకుల వివరాలను పాలిసెట్ వెబ్‌సైట్‌లో పొందవచ్చని, వెబ్ కౌన్సెలింగ్ మే 29 నుంచి జరుగుతుందని చెప్పారు. దీనిపై త్వరలోనే ప్రకటన వెలువరిస్తామన్నారు. అభ్యర్థులు ఆ ప్రకటననే కాల్ లెటర్‌గా భావించి వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ కోసం విడిగా కాల్ లెటర్ ఉండదని నాగరాణి తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు 2023-24 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాలో పాలిటెక్నిక్ ప్రవేశానికి అర్హత కోల్పోతారన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యా శాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి కేవీ రమణ బాబు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బి.జానకి రామయ్య, ఉప కార్యదర్శి రవి కుమార్, డాక్టర్ కల్యాణ్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో జూన్ 13-15 తేదీలలో

రాష్ట్ర రైతు సమ్మేళనాలు జయప్రదం చేయండి

కేవీవీ ప్రసాద్, ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేటలో జూన్ 13, 14, 15 తేదీల జరిగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమ్మేళనాలు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనం నిర్వహణ కోసం రైతు సంఘం సన్నాహక సమావేశం నరసరావుపేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ సమ్మేళనాలలో రాష్ట్ర నలుమూలల నుంచి 300 మంది రైతు ప్రతినిధులు, రైతు సంఘ నాయకులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో నిపుణులైన శాస్త్ర వేత్తలు పాల్గొంటారని చెప్పారు. అనేక రకాల పంటలు పండిచే ఆదర్శ రైతులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమ్మేళనాలలో దేశంలో వ్యవసాయ రంగ పరిస్థితి, వ్యవసాయంలో వస్తున్న నూతన పంటలు, కౌలు రైతుల స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, రైతాంగ సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం, రైతాంగ ఉత్పత్తులకు మద్దతు ధరలకు కొనుగోలు, మార్కెటింగ్ సౌకర్యాలు, రాబోయే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాల సరఫరా, రైతులు, కౌలు రైతులందరికీ బ్యాంక్ రుణాలు, పంట బీమ సక్రమ అమలు తదితర అంశాలను రైతు సమ్మేళనంలో చర్చిస్తారని తెలిపారు. రాబోయే ఎన్నికలలో రైతాంగ సమస్యలపై దృష్టి సారించి తమ ప్రణాళికలలో రైతుకు అవసరమైన పథకాలను చేర్చే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరు బాబూరావు, ఉలవలపూడి రాముతో పాటు నియోజక వర్గాల సీపీఐ కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరో 8 మంది ఐఏఎస్‌ల బదిలీలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. తాజాగా మరో 8 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి జీవో ఆర్టీ నంబర్ 985ను జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా జేసీగా ఆర్. గోవిందరావును, అన్నమయ్య జిల్లా జేసీగా పర్మాన్ అహ్మద్ ఖాన్‌ను, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా జి. క్రిస్ట్ కిషోర్, ఢిల్లీ ఏపీ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్‌గా హిమాన్షు కౌశిక్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా భరత్ తేజ, గ్రామాల సర్వే, మ్యాపింగ్ స్వామిత్వ కార్యక్రమం స్పెషల్ కమిషనర్‌గా ఏ. సిరి, బీమా వైద్య సేవల డిపార్టుమెంట్ డైరెక్టర్‌గా వి.ఆంజనేయులు, ఆయుష్ కమిషనర్‌గా ఎస్‌బీఆర్ కుమార్‌ను నియమిస్తున్నట్లు సీఎస్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

మిగ్-21 యుద్ధ విమానాలు నిలిపివేత

వైమానిక దళం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: మిగ్ -21 యుద్ధ విమానాల విషయంలో వైమానిక దళం కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ నెల ప్రారంభంలో రాజస్థాన్‌లో జరిగిన ప్రమాదానికి గల కారణాలపై విచారణ పూర్తయ్యే వరకు యుద్ధ విమానాల వినియోగాన్ని నిలిపివేయాలని నిర్ణయించింది. సూరత్‌గఢ్ ఎయిర్‌బేస్ నుంచి బయలుదేరిన మిగ్-21 బైసన్ విమానం మే 8న రాజస్థాన్‌లో కూలడంతో ముగ్గురు పౌరులు మృతి చెందారు. విచారణ పూర్తయి, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునే వరకు మిగ్-21 విమానాలను నిలిపివేస్తున్నట్లు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఎయిర్‌ఫోర్స్‌లో మూడు మిగ్-21 స్క్వాడ్రన్‌లు మాత్రమే పనిచేస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో దశలవారీగా రక్షణశాఖ వాటిని తొలగించనున్నది. భారత వైమానిక దళంలో 31 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ స్క్వాడ్రన్‌లు ఉన్నాయి. వాటిలో మూడు మిగ్-21 బైసన్ వేరియంట్. 1960లలో భారత వైమానిక దళంలోకి మిగ్-21 ప్రవేశపెట్టారు. మిగ్ యుద్ధ విమానాలు ఇటీవల ప్రమాదాలకు గురవుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ క్రమంలోనే దశలవారీగా ఆ విమానాలను తొలగించేందుకు రక్షణ శాఖ వ్యూహ రచన చేస్తున్నది. ఎయిర్‌ఫోర్స్‌లోకి అధునాతన మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్‌తో పాటు ఎల్‌సీఏ మార్క్-1ఏ, ఎల్‌సీఏ మార్క్-2లతో సహా స్వదేశీ విమానాలను చేర్చాలని చూస్తున్నది.

సీబీఐ విచారణకు సమీర్ వాంఖడే

ముంబై: బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్‌ను డ్రగ్స్ కేసులో ఇరికించడానికి సంబంధించి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాజీ జోనల్ డైరెక్టర్ సమీర్ వాంఖడేను సీబీఐ శనివారం ముంబైలో ఐదుగంటలకుపైగా ప్రశ్నించింది. డ్రగ్స్ కేసులో ఆర్యన్‌ను ఇరికించకుండా ఉండేందుకు సమీర్ వాంఖడే రూ.25కోట్ల లంచం డిమాండ్ చేసినట్లుగా ఆరోపణలున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సమీర్ ఉదయం 10.15 గంటల సమయంలో బాంద్రా కుర్లా కాంపెక్స్‌లోని సీబీఐ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను మీడియా ప్రశ్నించింది. ఈ సందర్భంగా ఆయన 'సత్యమేవ జయతే' అంటూ వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2 గంటలకు దాదాపు 30 నిమిషాలు భోజన విరామం ఇచ్చారు. సాయంత్రం 4.30 గంటలకు విచారణ తర్వాత వెళ్లిపోయారు. సీబీఐ కేసు నమోదు చేసిన తర్వాత సమీర్ వాంఖడే విచారణకు హాజరుకావడం ఇదే తొలిసారి. ఈ కేసులో గురువారం విచారణకు పిలిచినా హాజరకాలేదు. నేరపూరిత కుట్ర, బెదిరింపులతో పాటు అవినీతి నిరోధక చట్టం కింద ఎన్‌సీబీ ఫిర్యాదు మేరకు సీబీఐ ఈ నెల 11న మాజీ జోనల్ డైరెక్టర్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో బొంబాయి హైకోర్టు ఊరట కల్పించింది. మే 22 వరకు అరెస్టు చేయొద్దని సీబీఐని ఆదేశించింది.

అసోంలో టీచర్లకు డ్రెస్‌కోడ్

గువహటి: అస్సోం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు యూనిఫాం వేసుకున్నట్లే.. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకూ డ్రెస్ కోడ్ నిర్ణయించింది. విధులకు హాజరైనప్పుడు జీన్స్, టీషర్టులు, లెగ్గిన్స్‌ను పూర్తిగా నిషేధించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు ఉపాధ్యాయుల్ని చూసి ఎన్నో విషయాలు నేర్చుకుంటారని, వారి వస్త్రధారణ కూడా విద్యార్థులపై ప్రభావం చూపుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. అందుకే వారికి డ్రెస్ కోడ్ తప్పనిసరి చేసినట్లు తెలిపింది. "కొన్ని పాఠశాల్లోని ఉపాధ్యాయులు తమకు నచ్చిన దుస్తులు వేసుకొని పాఠశాలకు వస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. వృత్తికి గౌరవం కలిగేలా హుందాగా ఉండే దుస్తులు ధరించడం అవసరం" అని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి నారాయణ్ కొన్వార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలోనే రూల్‌బుక్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డా.రనోజ్ పేగు తెలిపారు. పాఠశాలను ఎలా నిర్వహించాలన్న అంశాలను అందులో పొందుపరుస్తామని చెప్పారు.

'దేవర'గా ఎన్టీఆర్

హైదరాబాద్: ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. శనివారం ఎన్టీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్ర టైటిల్‌ను ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు 'దేవర' అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఎన్టీఆర్ నల్లటి దుస్తుల్ని ధరించి భారీ ఆయుధాన్ని చేతబూని శక్తివంతంగా కనిపిస్తున్నారు. విస్మరణకు గురైన ఓ సుదూర తీరప్రాంత నేపథ్య కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మనుషుల్లో మృగాల వంటి అత్యంత భయంకర స్వభావుల నుంచి తన వారిని రక్షించుకోవడానికి ధీరోదాత్తుడైన వ్యక్తి చేసే పోరాటమే ఈ చిత్ర కథాంశమని సమాచారం. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

స్విట్జర్లాండ్‌లో చిరంజీవి ఆటపాట

హైదరాబాద్: చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్నారు. తమన్నా కథానాయిక. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. చెల్లెలి సెంటిమెంట్ ప్రధానంగా రూపొందిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తున్నారు. ఆగస్ట్ 11న ఈ చిత్రం విడుదల కానుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా స్విట్జర్లాండ్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. అక్కడి సుందరమైన లొకేషన్లలో చిరంజీవి, తమన్నాలపై ఓ పాటను తెరకెక్కిస్తున్నారు. ఈ పాట సినిమాలో ప్రధానాకర్షణగా నిలుస్తుందని చెబుతున్నారు. స్విట్జర్లాండ్ షెడ్యూల్‌లో పాటతో పాటు కీలక తారాగణం పాల్గొనగా ముఖ్య సన్నివేశాలను కూడా తెరకెక్కిస్తారని సమాచారం. ఈ చిత్రానికి మహతి స్వరసాగర్ సంగీతాన్నందిస్తున్నాడు.

జూన్ 9న 'టక్కర్'

హైదరాబాద్: సిద్ధార్థ్ హీరోగా కార్తీక్ జి.క్రిష్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం టక్కర్. ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో భారీ స్థాయిలో విడుదల కానుంది.

సాధారణంగా సిద్ధార్థ్ సినిమాలలో ప్రేమ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే ఈ సినిమాలో ప్రేమ సన్నివేశాలతో పాటు ఉత్కంఠను రేపేలా అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు కూడా ఉండనున్నాయి. ఇప్పటికే విడుదలైన 'టక్కర్' టీజర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక టీజర్‌లో సిద్ధార్థ్ సరికొత్త మేకోవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాలో అభిమన్యు సింగ్, యోగి బాబు, మునీశ్ కాంత్, ఆర్జే విఘ్నేశ్ కాంత్ తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. నివాస్ కె. ప్రసన్న సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా వాంచినాథన్ మురుగేశన్, ఆర్ట్ డైరెక్టర్‌గా ఉదయ కుమార్ కె, ఎడిటర్‌గా జీఏ గౌతమ్ వ్యవహరిస్తున్నారు.

సమగ్ర ఆహార వ్యవస్థ అవశ్యం

జీ7 సదస్సులో మోదీ పిలుపు

హిరోషిమా: ప్రపంచంలోని అభాగ్యులను దృష్టిలో పెట్టుకొని సమగ్ర ఆహార వ్యవస్థను ఏర్పాటు చేయడం అవసరమని భారత ప్రధాని నరేంద్రమోదీ శనివారం జీ7శిఖరాగ్ర సదస్సులో వక్కాణించారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రజాస్వామికీకరణ (టెక్నాలజీ డెమొక్రటైజేషన్)కు పిలుపునిచ్చారు. ఇది అభివృద్ధికి ప్రజాస్వామ్యానికి మధ్య వారధి అవుతుందన్నారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని, సహజ వనరుల పూర్తిస్థాయి వినియోగంపై దృష్టిని కేంద్రీకరించాలన్నారు. వినిమయాధారిత అభివృద్ధి నమూనా మార్చాలని చెప్పారు. సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రపంచ పేదలపై దృష్టిపెట్టే విధంగా సమగ్ర ఆహార వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం అవసరమని నొక్కిచెప్పారు. ప్రపంచ ఎరువుల సరఫరా గొలుసులను పటిష్ఠపర్చుకోవాలని, ఇందుకు ఎదురయ్యే రాజకీయ అవరోధాలను తొలగించాలని, ఎరువుల వనరులను స్వాధీనపర్చుకున్న 'ఎక్స్‌ప్యాన్షనిస్ట్' మనస్తత్వం మారాలని, తమ సహకారానికి ఇదే ఉద్దేశం కావాలని జీ7 దేశాలనుద్దేశించి మోదీ అన్నారు. ఆయన ఏ దేశం పేరును ప్రస్తావించలేదు. ఆహార వృథాను నియంత్రించాలని పిలుపునిచ్చారు. సుస్థిరమైన ప్రపంచ ఆహార భద్రత అందరి బాధ్యతన్నారు. అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజాస్వామ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. తాజా చర్చలు జీ20, జీ7 దేశాల అజెండాలలో ఉమ్మడి లక్ష్యాలకు దోహదమవుతాయని, గ్లోబల్ సౌత్ ఆకాంక్షల ప్రాముఖ్యతకు ఉపయుక్తంగా పరిణమిస్తాయని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎరువులకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి సేద్యం కొత్త నమూనాను రూపొందిం చవచ్చని చెప్పారు. డిజిటల్ టెక్నాలజీ ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి రైతుకు చేరాలన్నారు. 'ఫ్యాషన్ స్టేట్మెంట్, కామర్స్' నుంచి సేంద్రీయ ఆహారాన్ని వేరు చేయాలని, పౌష్టికాహారం, ఆరోగ్యంతో ముడిపెట్టాలని అన్నారు. మిల్లెట్లతో ప్రమోజనం పొందాలని సూచించారు. పౌష్టికత, వాతావరణ మార్పు, నీటి పరిరక్షణ, ఆహార భద్రతకు మిల్లెట్లు పరిష్కారం చూపుతాయని, దీనిపై అవగాహన పెంచుకోవడం అవసరమని మోదీ వెల్లడించారు.

రేపటి నుంచి కర్నాటక అసెంబ్లీ సమావేశాలు

సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు మే 22 సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించి, స్పీకర్‌ను ఎన్నుకుంటారు. కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అఖండ విజయం సాధించిన వారం రోజుల తర్వాత శనివారం సిద్ధరామయ్య రెండవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా, ఎనిమిది శాసన సభ్యులు మంత్రులుగా ప్రమాణం చేశారు. సిద్ధరామయ్య మాట్లాడుతూ 'మే 24 లోపు కొత్త అసెంబ్లీని ఏర్పాటు చేయవలసి ఉన్నందున సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించవలసిందిగా మేము గవర్నర్‌ను అభ్యర్థిస్తున్నాము. అలాగే ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించేందుకు సీనియర్ ఎమ్మెల్యే ఆర్.వి.దేశ్‌పాండేను ప్రోటెం స్పీకర్‌గా ఉండవలసిందిగా కోరాము' అని తెలిపారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత శనివారం కేబినెట్ తొలి సమావేశానికి అధ్యక్షత వహించిన సిద్ధరామయ్య అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశాల్లోనే అసెంబ్లీ కొత్త స్పీకర్‌ను ఎన్నుకుంటామని అన్నారు.

జీ7 దేశాధినేతలతో మోదీ భేటీలు

మానవత్వ సమస్య పరిష్కారానికి కృషిచేస్తా: ఉక్రెయిన్‌కు హామీ

హిరోషిమా: భారత ప్రధాని నరేంద్రమోదీ శనివారం జపాన్‌లోని హిరోషిమాలో జీ7 శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యారు. ఇదే క్రమంలో ఉక్రెయిన్, బ్రిటన్, ఇండోనేసియా, ఫ్రాన్స్, అమెరికా దేశాధినేతలతో పాటు ఐక్యరాజ్య సమితి అధ్యక్షుడిని కలిశారు. వారితో వేర్వేరుగా సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. బ్రిటన్ ప్రధాని రిషి సునక్‌ను కలిసినప్పుడు ఆయనను ఆలింగం చేసుకున్నారు. ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో, ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్‌తో సమావేశాలు అద్భుతంగా సాగినట్లు మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ప్రపంచ దేశాధినేతలతో భేటీల చిత్రాలనూ ట్వీట్‌చేశారు. జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్‌సుక్ యోల్, వియత్నాం ప్రధాని ఫామ్ మిన్హ చిన్హా, జర్మన్ ఛాన్సలర్ ఓలఫ్ స్కాల్జ్‌లతోనూ మోదీ చర్చలు జరిపారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయిన మోదీ యుద్ధం క్రమంలో నెలకొన్న 'మానవత్వ సమస్య' పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. 'ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేసింది. ఇది రాజకీయ, ఆర్థిక సమస్యగా కాకుండా మానవత్వం, మానవ విలువలకు సంబంధించిన సమస్యగా పరిగణిస్తున్నా. ఉక్రెయిన్ నుంచి తిరిగొచ్చిన భారత విద్యార్థులు అక్కడి పరిస్థితులను వివరించినప్పుడు మీ పౌరుల వేదనను అర్థం చేసుకోగలిగా. ఈ సమస్యను పరిష్కరించేందుకు భారత్‌తోపాటు వ్యక్తిగతంగానూ సాధ్యమైనంత వరకూ కృషి చేస్తానని హామీ ఇస్తున్నా' అని జెలెన్‌స్కీతో మోదీ అన్నారు. గతేడాది ఫిబ్రవరిలో మొదలైన ఉక్రెయిన్-రష్యా యుద్ధం క్రమంలో మోదీ, జెలెన్‌స్కీ అనేకసార్లు ఫోన్‌లో, వర్చువల్‌గా మాట్లాడుకున్నారుగానీ జీ7 సదస్సు సందర్భంగా తొలిసారి ముఖాముఖి భేటీ అయ్యారు.

సీబీఐ ఎదుట అభిషేక్ బెనర్జీ హాజరు

కోల్‌కతా: పాఠశాల ఉద్యోగాల కుంభకోణంపై దర్యాప్తు సంస్థ విచారణలో భాగంగా టీఎంసీ నాయకుడు అభిషేక్ బెనర్జీ శనివారం ఉదయం సీబీఐ ముందు హాజరయ్యారు. బెనర్జీ ఉదయం 10.58 గంటల ప్రాంతంలో భారీ భద్రతా మోహరింపు మధ్య కోల్‌కతాలోని నిజాం ప్యాలెస్‌లోని సీబీఐ కార్యాలయానికి వెళ్లారు. ఇదిలాఉండగా, శనివారం ఉదయం పాఠశాల ఉద్యోగాల కుంభకోణంపై విచారణకు సంబంధించి టీఎంసీ అగ్ర నాయకత్వానికి సన్నిహితుడిగా భావించే సుజయ్ కృష్ణ భద్ర నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించిందని సీబీఐ అధికారి ఒకరు తెలిపారు. అలాగే 'కాళీఘాట్ ఎర్ కాకు' (కాళీఘాట్ మేనమామ) ప్రసిద్ధి చెందిన బెహాలా ఇంటిపై కూడా దాడులు నిర్వహించినట్లు వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ సహాయ పాఠశాలల్లో అక్రమ నియామకాలకు పాల్పడినట్లు ఆరోపణలపై భద్ర మార్చి 15న సీబీఐ ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో సీబీఐ ఈ కుంభకోణంలో నేర కోణంలో దర్యాప్తు చేస్తుండగా, ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది. కాగా, పశ్చిమ బెంగాల్‌లోని బంకురాలో ప్రచారంలో ఉన్న టీఎంసీ నాయకుడు సీబీఐ జారీ చేసిన సమన్లకు సమాధానం ఇవ్వడానికి కోల్‌కతా తిరిగి వచ్చాడు. శుక్రవారం రాత్రి తర్వాత టీఎంసీ నాయకుడు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అయిన అభిషేక్ బెనర్జీ తన వాహనంపై నుంచి ప్రసంగిస్తూ, తనపై అవినీతి లేదా దుష్ప్రవర్తనకు సంబంధించిన ఏదైనా రుజువు ఉంటే, తనను అరెస్టు చేయాలని సీబీఐకి సవాలు విసిరారు.

ఉపాధ్యాయ నియామకాల కుంభకోణంలో సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు తనను విచారించవచ్చని గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌ను కలకత్తా హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ కుంభకోణంలో నిందితుడైన కుంతల్ ఘోష్ దాఖలు చేసిన ఫిర్యాదులో టీఎంసీ నేత పేరు ప్రస్తావనకు వచ్చింది. ఈ కేసులో అభిషేక్ బెనర్జీ పేరు పెట్టాలని కేంద్ర దర్యాప్తు సంస్థలు తనపై ఒత్తిడి తెస్తున్నాయని ఘోష్ ఆరోపించారు. శుక్రవారం డివిజన్ బెంచ్‌ను ఆ తర్వాత కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రివిజన్ పిటిషన్‌ను విచారించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సోమవారం నుంచి హైకోర్టు వెకేషన్ బెంచ్ ముందు ఈ కేసు విచారణకు రావచ్చు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.